www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025 | పేజీలు: 12 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 113 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: ఏకాదశి మ.2:33 తదుపరి ద్వాదశి, నక్షత్రం: శతభిషం ఉ.10.49 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం:సా.4.42-6.10, దుర్ముహూర్తం: ఉ.10.07-10.58, మ.3.09-3.59, అమృతఘడియలు: రా.1.31-2.59, రాహుకాలం: మ.1.30-మ.3.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.29 | రాజమహేంద్రవరం సిటీ

Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025

Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | రాజమహేంద్రవరం సిటీ

సెల్‌ఫోన్.. టీవీకి దూరంగా ఉండి చదివి..సాధించా..


తల్లి గంగాభవాని, సోదరి రేష్మాంజని, స్టేట్ టాపర్ నేహాంజని

600 మార్కులు రావడం సంతోషంగా ఉంది. స్కూల్లో అందరూ 598 మార్కులు వస్తే చాలు అనుకున్నారు. కానీ నేను 600కి 600 రావాలనుకున్నాను. నేను పరీక్షలు రాసి వచ్చాక.. ప్రతిరోజూ క్వశ్చన్ పేపర్ కీని పరిశీలించేదాన్ని. అప్పుడే నాకు 600 మార్కులు వస్తాయని ఊహించా. నేను సెల్‌ఫోన్‌కు, టీవీకి దూరంగా ఉంటూ చదువుకున్నా.. ఐఏఎస్ సాధించడమే నా లక్ష్యం. నాకు ఇష్టమైన సబ్జెక్ట్ గణితం. ఈ మార్కులు నా కుటుంబానికి, మా స్కూల్ యాజమాన్యానికి అంకితమిస్తున్నా. **- నేహాంజని, టెన్త్ స్టేట్ టాపర్, కాకినాడ**

రోజుకు 12 గంటలు చదివా..



ఇష్టపడి చదవడం ద్వారా పదో తరగతి పరీక్షల్లో 599 మార్కులు సాధించా. రోజుకి 12 గంటల పాటు చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలు పాటించా. డాక్టర్ కావాలన్నదే నా లక్ష్యం. పేదలకు వైద్యం చేయాలని భావిస్తున్నా. మా తండ్రి కె.శివసూర్యనారాయణ ప్రైవేటు సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. తల్లి వీరరాఘవమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.
- కొట్టేటి ప్రేమసత్యలిఖిత, పిఠాపురం భాష్యం పాఠశాల

ఆరంభం నుంచి కష్టపడ్డా..



పదో తరగతి ఫలితాల్లో 599 మార్కులు సాధించడానికి చాలా కష్టపడ్డా.. ఆరంభం నుంచి ప్రణాళికాబద్ధంగా చదివా. మా ఉపాధ్యాయుల సహకారం ఎంతగానో ఉంది. జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదవాలన్నదే నా ఆశయం. మా తండ్రి రైల్వే ఉద్యోగి. మా ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, సబ్జెక్ట్ టీచర్లు ఎప్పటికపుడు గైడెన్స్ ఇచ్చేవారు. అది నాకు మంచి మార్కులు సాధించేందుకు దోహదపడింది.
- కె.హర్షిత్, రాజమహేంద్రవరం భాష్యం పాఠశాల

ఫలితం..పదిలం!

- కోనసీమలో 91.43 శాతం ఉత్తీర్ణత
- టెన్త్‌లో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- జిల్లాలో బాలురదే పైచేయి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన 91.43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. జిల్లాలో అధికంగా బాలురు ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా 18,871 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో 17,253 మంది అంటే 91.43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణతతో ప్రథమస్థానం సాధించగా, కోనసీమ జిల్లా 91.43 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయస్థానంలో నిలిచింది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా 47.64 శాతంతో ఉత్తీర్ణతతో చిట్టచివరి స్థానంలో నిలిచింది. కోనసీమ జిల్లాలో 9392 మంది బాలురు పరీక్షలు రాయగా వారిలో 8420 మంది 93.18.శాతం ఉత్తీర్ణత సాధించారు. 9479 మంది బాలికలు పరీక్షలు రాయగా వారిలో 8833 మంది 89.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో బాలురు 78.3 శాతం మంది ఉత్తీర్ణులైతే బాలికలు 84.09 శాతం మంది ఉత్తీర్ణులై ఆధిక్యత చాటుకున్నారు. కోనసీమ జిల్లాలో ఫస్ట్ డివిజన్‌లో 14,504 మంది, సెకండ్ డివిజన్‌లో 1900 మంది, థర్డ్ డివిజన్‌లో 849 మంది వెరసి 17,253 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంగ్లీష మీడియంలో 83.19శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులు కాగా తెలుగు మీడియంలో 58.59 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా అమలాపురం పట్టణానికి చెందిన శ్రీచైతన్యటెక్నోస్కూలు విద్యార్థి తురగా మధుచంద్రిక 597 మార్కులు, తాపేశ్వరంలోని శ్రీచైతన్య టెక్నోస్కూల్‌కు చెందిన పోతంశెట్టి రామతులసిలు 597 జిల్లాలో అత్యధిక మార్కులు సాధించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి అడ్వాన్స్ సప్లిమెంటరీని మే 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

రీకౌంటింగ్.. రీవెరిఫికేషన్

- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం 24న ఉదయం 10 నుంచి మే 1 రాత్రి 11 గంటల వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. రీకౌంటింగ్‌కి ఒక సబ్జెక్టుకు రూ.500, రీవె రిఫికేషన్‌కి ఒక సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. గతంలో మాదిరిగా సీఎఫ్ఎంఎస్ సిటి జన్ చలాన్ ద్వారా చెల్లింపు చేయరాదన్నారు.
- ఓపెన్ స్కూల్ విద్యార్థులు రీకౌంటింగ్‌కి రూ.200, రీవెరిఫికేషన్, జిరాక్సు కాపీల జారీకి రూ.వెయ్యి.అడ్వాన్సు సప్లిమెం టరీకి ఈ నెల 26 నుంచి మే 5లోపుగా ఏపీ ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అడ్వాన్సు సంప్లిమెంటరీని మే 19 నుంచి 24 వరకూ నిర్వహిస్తారు. వివరాలకు హైస్కూల్ హెచ్ఎంని సంప్రదించాలి.

మండలాల వారీ ఇలా..

మండలం పేరు	హాజరైనవారు	ఉత్తీర్ణత	శాతం
కె.గంగవరం	415	410	978.32
ఉప్పలగుప్తం	551	541	98.19
కాట్రేనికోన	593	581	97.98
ఐ.పోలవరం	732	717	97.95
సఖినేటిపల్లి	653	638	97.70
మలికిపురం	779	754	96.79
ముమ్మిడివరం	828	797	96.21
అయినవిల్లి	686	660	95.51
మామిడికుదురు	847	809	95.51
కపిలేశ్వరపురం	469	447	95.31
అంబాజీపేట	489	464	94.89
అల్లవరం	616	570	92.53
ఆలమూరు	727	670	92.16
రాజోలు	934	845	90.47
అమలాపురం	2161	1940	89.77
మండపేట	1767	1579	89.36
పి.గన్నవరం	781	697	89.24
ఆత్రేయపురం	565	503	89.03
రాయవరం	686	607	88.48
రావులపాలెం	1063	933	87.77
కొత్తపేట	910	771	84.73
రామచంద్రపురం	1617	1320	81.63
మొత్తం	18,871	17,253	91.43

డ్రోన్ ఎగరేశారు.. ఆచూకీ పట్టేశారు!



పి.గన్నవరం : కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కంద్రిగపేటకు చెందిన ఆరుగురు బాలబాలికలు గత నెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు.పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా వారు పి.గన్నవరం వైపు వెళ్లినట్టు గుర్తించారు. పి.గన్నవరం పరిసర లంకగ్రామాల్లో రెండు, మూడు రోజులు సంచరించారని స్థానికులు చెప్పడంతో కోనసీమ జిల్లా పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టులు నుంచి డ్రోన్ కెమెరా సాయంతో వారు తిరిగిన లంక గ్రామాల్లో ప్రదేశాలను పరిశీలించారు. పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం వద్ద గుర్తించారు. గాలింపు చర్యలను స్వయంగా ఎస్పీ బి.కృష్ణారావు మండల కేంద్రంలో ఉండి పరిశీలించారు.

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాపవరంలో ఇటీవల డ్రోన్ ఎగురవేశారు. శివారు ప్రాంతంలో పొలాల మధ్య పేకాట శిబిరం కనిపించింది. పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.అక్కడే ఉన్న పలువురు ఒక్కసారిగా పోలీసులు రావడం చూసి పరుగులు తీశారు. ఇలా జిల్లావ్యాప్తంగా రాజానగరం, రాజమహేంద్రవరంలో పలు కేసులు నమోదయ్యాయి.

కాకినాడ నగరంలోని ఎంఎస్ఎన్ చారిటీస్ వెనుక ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇటీవల డ్రోన్ ఎగరవేసి గంజాయి బ్యాచ్ ఆగడాలను పోలీసులు అడ్డుకున్నారు. ఎవరికీ కనిపించకుండా శివారు ప్రాంతాల్లో గుట్టుగా అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు. పోలీసులు డ్రోన్ సాయంతో పట్టేసి ఉక్కుపాదం మోపుతున్నారు. వెంటాడి మరీ వేటాడుతూ పూర్తి సాక్ష్యాధారాలతో కేసులు నమోదు చేస్తున్నారు.


కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్, కలెక్టర్

కేంద్ర ప్రభుత్వం పథకాల లబ్ధి సామాన్యులకు చేరువకావాలి

దిశ సమావేశంలో ఎంపీ హరీష్‌మాధుర్ శాఖల వారీగా సమీక్ష

అమలాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేద ప్రజలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రయోజిత పథకాల తీరుతెన్నులు, ఎదురవుతున్న సమస్యలు, అధికారుల సమన్వయ లోపాలు వంటి సమస్యలపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవన్‌లో ఏర్పాటైన దిశ జిల్లాస్థాయి అభివృద్ధి, సమన్వయ మోనటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావులు వేదికపై పాల్గొనగా దిశ సమావేశానికి జిల్లాస్థాయి అధికారులంతా హాజరయ్యారు. మూడు గంటలకు పైగా జరిగిన సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను శాఖల వారీగా సమీక్షించారు. సామాన్యుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలు ఉండాలన్నారు. వారికి కేంద్రం అందించే పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. వివిధ పథకాల అమలు తీరులో జరుగుతున్న జాప్యాలకు కారణాలపై ఆరా తీశారు. పథకాల అమలులో పరిపాలనా పరమైన ఇబ్బందులు ఉంటే కేంద్రం దృష్టికి తీసుకువెళతానని, అటువంటి వాటిని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. 15వ ఆర్థికసంఘం నిధులతో ప్రాధాన్యత పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. జలమిషన్ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ ఏర్పాటు, ద్వారపూడి రైల్వేలైన్‌లో ఉన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పరిష్కారం కోసం తీసుకువెళుతున్నట్టు చెప్పారు. అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి మూలాధారమైన తాగునీరు, పారిశుధ్యంలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా సూచించారు. ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నరేగాలో పనిదినాలను వందకు పెంచాలన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు.

డ్రోన్.. ఆన్ డ్యూటీ!



నేరాల అదుపునకు గాలిలో పోలీస్

6 కి.మీ పసిగట్టేస్తోంది..

ఒక్కో డ్రోన్ విలువ సుమారు రూ.2 లక్షలు..48 మెగా పిక్సెల్ కెమెరా, 4కే హెచ్‌డీ వీడియో రికార్డింగ్‌తో పాటు రాత్రివేళల్లో కూడా 300 మీటర్ల వరకు వీడియో, ఫొటోలు క్యాప్చర్ చేయగలిగిన సామర్థ్యం ఉంది.ఇవి 500 మీటర్ల ఎత్తు ఎగరగలవు. 6 కిలోమీటర్ల దూరం ప్రయా ణించగలవు.ఒక్కో డ్రోన్‌లో 46 నిమిషాలు వచ్చే ఒక బ్యాటరీ ఉండగా.. మరో బ్యాటరీ బ్యాకప్ ఉంటుంది. లైవ్ కెమెరా ఉండడంతో వీడియో తీస్తున్న సమయంలోనే ఆ వీడియోని డ్రోన్‌కి అనుసంధానించిన సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో చూడవచ్చు. కాకినాడ జిల్లాలో స్టేషన్‌కు ముగ్గురు చొప్పున 97 మంది కానిస్టేబుళ్లకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు.రెండు స్టేషన్లకు ఒకటి చొప్పున డ్రోన్లు ఉండగా..రోజుకు మూడు షిఫ్టుల వారీగా డ్రోన్లను ఎగురవేస్తున్నారు. వినియోగించే ఏర్పాట్లు చేశారు.తూర్పుగోదావరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లు ఉండగా 150 మందికి డ్రోన్ల విని యోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి కానిస్టేబుల్‌కి దశల వారీగా శిక్ష ణ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు.పలు స్టేషన్లలో డ్రోన్లు పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని తెలుస్తోంది. అదే జరిగితే బ్యాటరీలు డెడ్ అయిపోవడం, సాంకేతిక లోపాలు తలెత్తడం తదితర సమస్యలు వస్తాయి.



- డ్రోన్లతో పోలీసుల పహరా
- 24 గంటలపాటు అప్రమత్తం
- కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ
- అసాంఘిక ప్రదేశాలపై నిఘా
- ర్యాలీలు, ధర్నాల్లో విధులు
- రాత్రివేళల్లోనూ చూపు

(రాజమహేంద్రవరం/కాకినాడ - ఆంధ్రజ్యోతి)

నేర పరిశోధనలో పోలీసులు సాంకేతికను జోడిస్తూ.. నేర నియంత్రణకు కృషి చేస్తున్నారు. మనుషులు వెళ్లలేని ప్రదేశాలను సైతం జల్లె డపడుతున్నారు. శివారు ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడుతున్నారు. అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేంతగా టెక్నాలజీని వాడుతున్నారు. నేరాలు జరగక ముందే వాటిని పసిగట్టి నివారణ చర్యలు చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాల కట్టడికి డ్రోన్ల వినియోగానికి పచ్చ జెండా ఊపింది. పోలీసు యంత్రాంగానికి డ్రోన్లు అందజేసింది. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి, జూదం, వ్యభిచారం, ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వికృత చేష్టలు, ట్రాఫిక్ రద్దీ వంటివి తగ్గుముఖం పట్టించే దిశగా డ్రోన్లను వినియోగిస్తున్నారు.



నేరాల అదుపులో కీలకం..

నేరాల అదుపునకు టెక్నాలజీని వినియోగిస్తున్నాం. డ్రోన్ల వినియోగం ద్వారా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ, అసాంఘిక కార్యకలాపాలు జరకుండా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి, బహిరంగ మద్యపానం, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ రద్దీ సమస్యలు, జన సంచారం అధికంగా ఉండేచోట్ల పరిస్థితులను గమనించి ఆయా స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నాం.
- బిందుమాధవ్, ఎస్పీ, కాకినాడ జిల్లా

ఉమ్మడి జిల్లాలో 31 డ్రోన్లు

కాకినాడ జిల్లాలో ఉన్న మొత్తం 28 పోలీస్ స్టేషన్లలో గతంలో కేవలం నాలుగు డ్రోన్లనే జిల్లా పోలీసులు వినియోగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం చంద్రబాబు నేరాల అదుపునకు సాంకేతికను జోడించాలని సూచించడంతో డ్రోన్ల వాడకంపై దృష్టిపెట్టారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుమారు 13 డ్రోన్ కెమెరాలను జిల్లా పోలీసులకు అందజేశారు. దీంతో జిల్లాలో మొత్తం 28 పోలీసు స్టేషన్లకు ప్రస్తుతం 17 డ్రోన్లు ఉన్నాయి. తుని టౌన్, అన్నవరం, తొండంగి, ప్రత్తిపాడు, పిఠాపురం టౌన్, సర్పవరం స్టేషన్, కాకినాడ టూ టౌన్, కాకినాడ పోర్టు, కరప, ట్రాఫిక్ -1, ఇంద్రపాలెం స్టేషన్లలో ప్రస్తుతం డ్రోన్లు అందుబాటులో ఉంచారు. కాకి నాడ జిల్లాలో ఇప్పటి వరకు డ్రోన్ల ద్వారా సుమారు 100కు పైగా కేసులు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 10 డ్రోన్లు అందు బాటులో ఉన్నాయి. హెడ్ క్వార్టర్ రాజమహేం ద్రవరంలో 4, దేవరపల్లి, బొమ్మూరు, బిక్కవోలు పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్కటి, నిడదవోలులో 3 ఉన్నాయి.జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ స్టేషనుకూ కనీసం ఒక డ్రోన్ ఉండాలని ఎస్పీ నరసింహ కిశోర్ నిర్ణయించారు. దీంతో ప్రతి స్టేషన్‌కీ ఒకటి ఏర్పాటు చేసుకునే పనిలో అధికారులు ఉన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) లేదా ఇతరుల నుంచి వితరణ ద్వారా డ్రోన్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నా రు. పోలీస్ స్టేషన్లకు ఎవరైనా డ్రోన్లు కొనిస్తే సమాజానికి ఎంతో కొంత మేలు చేసిన వారవుతారనేది వాస్తవం. కోనసీమ జిల్లాలో 4 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి.

గాలిలో నిఘా నేత్రం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్టేషన్ల వారీగా అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. ఆ ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి.. అక్కడ జరిగే అసాంఘిక కార్యకలాపాలను చిత్రీకరిస్తున్నారు. శిక్షణ పొందిన కానిస్టేబుల్ డ్రోన్ ఎగిరే సమయంలో కనిపించే దృశ్యాలు, వ్యక్తులు, ఆయా స్థావరాలను గుర్తించి అక్కడికి పోలీసు బృందాలను పంపుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం డ్రోన్లను వినియోగించింది. జాతరలు, ర్యాలీలు, ఉత్సవాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

ఇంకా అవసరం

జిల్లాలో డ్రోన్ల సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. గోదావరి పుష్కరాలు సమీపిస్తుండడంతో పోలీసులకు డ్రోన్లు అత్యంత ముఖ్యమైన ఉపకరణాలుగా ఉంటాయి. తూర్పుగోదావరి, కోనసీమజిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం విస్తారంగా ఉంది. గోదావరిలో ఇసుక మేటలు వేసినచోట లంకల్లా ఏర్పడ్డాయి. ఆ లంకలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. అక్కడికి పోలీసులు వెళ్లాలంటే కష్టమే. డ్రోన్లుతో నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా పోలీసులు ఇప్పటినుంచే లంకలపై దృష్టి సారించాల్సి ఉంది. డ్రోన్లను చాలా రకాలుగా ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికే విశాఖ వంటి నగరాల్లో డ్రోన్లను ఉపయోగించి హెల్మెట్ ధరించకపోవడం, సిగ్నల్ జంపింగ్, నెంబర్‌ప్లేట్లు లేకపోవడం, రాంగ్‌పార్కింగ్ వంటివాటికి చలానాలు విధిస్తున్నారు.


గంటిపెదపూడిలో వంతెన పనులు పరిశీలిస్తున్న ఏఐఐబీ ప్రతినిధులు, ఎమ్మెల్యే గిడ్డి

వంతెన నిర్మాణ పనులు పరిశీలించిన ఏఐఐబీ ప్రతినిధులు

పి.గన్నవరం, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): వశిష్ఠ నదీపాయపై లంక గ్రామాలను కలిపే వంతెన నిర్మాణం పూర్తి నాణ్యత ప్రమాణాలతో జరుగుతోందని ఏఐఐబీ ప్రాజెక్టు టీమ్ లీడర్, ఇన్వెస్ట్మెంట్ ఆధికారి పవన్ కార్కి(నేపాల్) అన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు ఒక్క బిల్లు కూడా మంజూరు కాలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సంబంధిత మంత్రి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో జరిగే భేటీలో చర్చిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని వంతెన నిర్మాణం పూర్తిచేస్తున్న కాంట్రాక్టర్ పీపీ రాజుకు ఆయన అభినందనలు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే నాలుగు లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని చెప్పారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు లంకగ్రామాల ప్రయోజనార్థం రూ.49.50 కోట్లతో వంతెన నిర్మాణం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు వంతెన పనులు 50 శాతం పూర్తయినప్పటికీ ఒక్క బిల్లు కూడా రాలేదన్నారు. ఇదే విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి రెండుసార్లు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఆయన రెండవసారి ప్రత్యేకంగా మాట్లాడారని, త్వరలోనే బిల్లులు విడుదల చేస్తారని చెప్పారు. తొలుత ఏఐఐబీ ప్రతినిధుల బృందం పూర్తయిన పిల్లర్లు తదితర అంశాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఏఐఐబీ సభ్యులు ఎన్విరాన్మెంటల్ స్పెషలిస్ట్ మాయ గాబ్రిమేల్ విలాలాంజ్ (ఫిలిఫైన్స్), ప్రొక్యూర్మెంట్ స్పెషలిస్ట్ ఫ్రాన్సిస్ లార్లా సావెళ్ల(ఫిలీఫైన్స్), సోషల్ స్పెషలిస్ట్ శివరామశాస్త్రి(ఏపీ) తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

పదిని.. నూరేశారు!

పదో తరగతిలో విద్యార్థులు ఈసారి చరిత్ర సృష్టించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ భాష్యం స్కూల్‌కు చెందిన యాళ్ల నేహాంజలి 600 మార్కులకుగాను 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. అలాగే పిఠాపురం భాష్యం స్కూల్‌కు చెందిన కొట్టేటి ప్రేమ సత్య లిఖిత 599 మార్కులు సాధించగా, రాజమహేంద్రవరంలోని భాష్యం స్కూల్‌కు చెందిన విద్యార్థి కె.హర్షిత్ 599 మార్కులు సాధించారు. అదేవిధంగా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 595పైబడి మార్కులు వచ్చినవారు సైతం ఈసారి అధిక సంఖ్యలోనే ఉండడం విశేషం. వీరిలో అమ్మాయిలే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఆయా విద్యార్థులతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. ఆ వివరాలు...

- ఆంధ్రజ్యోతి- అమలాపురం/మండపేట/ముమ్మిడివరం/ద్రాక్షారామ/దేవరపల్లి

టెన్త్‌లో సంచలన విజయాలు.. గత రికార్డులన్నీ బద్దలు.. అత్యధిక స్కోర్ చేసిన విద్యార్థుల మనోభావాలు

మద్రాస్ ఐఐటీలో సీటే లక్ష్యం



- పోతంశెట్టి రామతులసి /597

మండపేట మండలం తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్‌లో పదవ తరగతి చదివా. జిల్లాలో ప్రథమ స్థానంలో టాపర్‌గా 597 మార్కులతో ఉత్తీర్ణత సాధించా. మాది అనపర్తి మండలం కుతుకులూరు గ్రామం. 8వ తరగతి వరకు కూతుకులూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్నా. 9,10 తరగతులు తాపేశ్వరం శ్రీచైతన్యలో చదివా. భవిష్యత్‌లో మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ సీటు సాధించడమే నా తదుపరి లక్ష్యం.

ఐఐటీలో సీటే లక్ష్యంగా...



- తురగా మధుచంద్రిక /597

అమలాపురం పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో చదివా. పదో తరగతిలో 597 మార్కులతో జిల్లాలో అగ్రస్థానంలో నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించడం ద్వారా ఐఐటీలో మంచి విద్యా సంస్థలో సీటు సాధించాలనే లక్ష్యం ఉన్నా. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతోపాటు స్కూలు ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ విజయం సాధించా.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలని...



- పెద్దిరెడ్డి మోహనకృష్ణ సాత్విక్ /596

మండపేట మండలం తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్‌లో పదవ తరగతి చదివా. మాది ఆలమూరు మండలం కలవచర్ల గ్రామం. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు తాపేశ్వరం శ్రీచైతన్యలోనే చదివాను. ఈ ఫలితాల్లో 596 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. ఐఐటీ చదివి భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే నా కల.

జేఈఈ మెయిన్ టార్గెట్‌గా..



- పోతుల శరణ్య /595

ముమ్మిడివరం శ్రీబాలాజీ హైస్కూలులో పదో తరగతి చదివా. 595 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. తండ్రి శామ్యూల్, తల్లి స్వర్ణకుమారి వ్యవసాయ కార్మికులు. ఇంటర్‌లో ఎంపీటీసీ గ్రూపు తీసుకుని మంచి మార్కులతో పాసై ఆ తర్వాత జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకును సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే నా కల.

ఐఐటీలో సీటు తదుపరి లక్ష్యం



- కర్రి హర్షిత /595

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 595 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. మాది రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామం. ద్రాక్షారామ శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పదో తరగతి చదివా. నా తండ్రి కర్రి దుర్గారావు శ్రీచైతన్య పాఠశాలలో డీన్. తల్లి సూర్యకుమారి గృహిణి. ఐఐటీలో సీటు సాధించడమే భవిష్యత్ లక్ష్యం.

డాక్టర్ కావడమే లక్ష్యం



- దవులూరి మేఘన వెంకట సత్య/595

ఇంటర్ బైపీసీలో చేరి నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడమే లక్ష్యం. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 595 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. మాది రామచంద్రపురం మండలం తోటపేట. ఇక్కడే ఉన్న సూర్య ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో పదో తరగతి చదివా. తండ్రి శ్రీను తాపీమేస్త్రి తల్లి వరలక్ష్మి గృహిణి, డాక్టర్ కావడమే తన లక్ష్యం.

ఐపీఎస్ అవ్వాలని కల



- ముత్యాల జ్ఞానసాయి దీపిక /595

మాది దేవరపల్లి మండలం బంధపురం గ్రామం. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో పదో తరగతి చదివా. బుధవారం విడుదలైన ఫలితాల్లో 595 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచా. తల్లిదండ్రులు ముత్యాల రమేశ్, బంగారులక్ష్మి. వ్యవసాయ కూలీలు. ఐపీఎస్ కావాలనేది నా కల. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

ఇంటర్‌లో స్టేట్ ర్యాంకు సాధిస్తా



- వి.తేజ సుమశ్రీ /596

పదవ తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. కొవ్వూరు అభ్యాస పాఠశాలలో చదివాను. నా తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఈ విజయాన్ని సాధించాను. ఈ ఫలితాలనే ఇంటర్‌లోనూ కొనసాగించి స్టేట్‌ర్యాంకు సాధిస్తా. ఐఐటీలో సీటు సాధించడమే నా లక్ష్యం.



డాక్టర్ కావాలని..

- వెలగల శిరీష /595

డాక్టర్ అయ్యి పేద ప్రజలకు సేవచేయాలన్నది నా లక్ష్యం. కొవ్వూరు నారాయణ పాఠశాలలో పదవ తరగతి చదివాను. పదో తరగతిలో 595 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉంది. నా తండ్రి ఆటో డ్రైవర్, తల్లి గృహిణి. అన్నయ్య పదవ తరగతి చదివి మానివేశాడు. డాక్టర్ విద్యను అభ్యసించి పేద ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం. ఇంటర్‌లోనూ మంచి స్కోర్ చేస్తా.



రాజోలులో రెండు చేతులు లేకుండా పదో తరగతి పరీక్షలు రాసిన బాబి

రెండు చేతులు లేకపోయినా..

పదో తరగతి పాసైన బాబి

రాజోలు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజోలుకు చెందిన చెల్లుబోయిన బాబి రాజోలు జిల్లాప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యను అభ్యసించాడు. రెండు చేతులు లేని దివ్యాంగుడైన బాబి ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. బుధవారం విడుదలైన పది ఫలితాల్లో 291 మార్కులతో సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించాడు. బాబిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ముంజవరపుకొట్టు హైస్కూల్లో నూరుశాతం ఉత్తీర్ణత

పి.గన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండల ముంజవరపుకొట్టు జిల్లా పరిషత్ హైస్కూల్లో 17 మంది విద్యార్థులకుగాను 17 మంది విద్యార్థులూ ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఏడుగురు బాలురు, పది మంది బాలికలు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.



పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ జడ్పీ ఉన్నతపాఠశాల



పాఠశాల ప్రాంగణంలో స్థలదాత, మాజీ ఎమ్మెల్యే దివంగత బిరుదా సూర్యనారాయణ విగ్రహం

ఆనాటి ఆశయానికి..

నేటి వజ్రోత్సవం సాక్ష్యం

» 75 వసంతాల వేడుకలకు ముస్తాబైన పెద్దాపురప్పాడు హైస్కూల్

కరప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడులో శ్రీ బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) జడ్పీ ఉన్నతపాఠశాల వజ్రోత్సవ వేడుకలకు ముస్తాబైంది. ఈ హైస్కూల్ స్థాపించి 75ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 26, 27 తేదీల్లో డైమండ్ జూబ్లీ వేడుకలను అట్టహాసంగా జరపడానికి పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వేడుకలకు రావాల్సిందిగా ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులకు ఆహ్వానాలు అందాయి. హైస్కూల్ స్థలదాత, మాజీ ఎమ్మెల్యే బిరుదా సూర్యనారాయణ కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైస్కూల్ భవనాలు, ప్రహరీ, ప్రాంగణంలో ఉన్న స్థలదాత సూర్యనారాయణ, సరస్వతిదేవి ఇతర విగ్రహాలకు రంగులు వేయించి వేడుకలకు సిద్ధం చేశారు. పాఠశాలకు అవసరమైన వసతులు, మౌలిక సదుపాయాలను కల్పించడానికి పూర్వవిద్యార్థులు సమాయత్తమవుతున్నారు.

స్ఫూర్తి ప్రదాత.. స్థలదాత

స్వతంత్ర భారత తొలి తరాల పాఠశాలగా భావించే పెద్దాపురప్పాడు హైస్కూల్ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) చేసిన కృషి మరువలేనిది. గ్రామీణ ప్రాంతవాసులకు ఉన్నత విద్యనందించాలనే ఏకైక సంకల్పంతో ఆయన తనకున్న ఏడెకరాల భూమిని ఉదారంగా ఇచ్చేశా రు. 1950లో కాకినాడ-కోటిపల్లి ప్రధాన రహదారిని చేర్చి కరపమండలం పెద్దాపురప్పాడులో సువిశాల ప్రాంగణంలో హైస్కూల్ ఏర్పా టైంది. అప్పట్నుంచి పరిసర గ్రామాల్లోని వేలాదిమంది ఇక్కడ చదువుకుని ఉద్యోగ, వ్యాపార, సినీ, రాజకీయరంగాల్లో ఉన్నతస్థాయిలకు చేరుకున్నారు. పేద,మధ్యతరగతి ప్రజల జీవితాల్లో విద్యావెలుగులు నింపిన సూర్యనారాయణ ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.

కృష్ణంరాజు చదువుకున్నది ఇక్కడే

ఈ పాఠశాలలో చదువుకుని ఎంతోమంది ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిలకు చేరుకున్నారు. సినీనటుడు దివంగత కృష్ణంరాజు ఈ పాఠశాలలోనే చదువుకున్నారు. యండమూరులోని తన పెద్దమ్మ ఇంట్లో ఉంటూ రోజూ సైకిల్‌పై ఇక్కడకు వచ్చి చదువుకునేవారు. 2022, సెప్టెంబరులో కృష్ణంరాజు మృతి చెందినప్పుడు ఆయన చదువుకున్న ఈ పాఠశాలను పలువురు సందర్శించి ఆయనతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ ఇంజనీర్ చక్రవర్తుల భాస్కరరావు, ఉద్యోగ రంగంలో ఉన్నత స్థాయిలకు వెళ్లిన తీపర్తి వీరభద్రరావు, నల్లా సత్యనారాయణమూర్తి, చిక్కం రాజయ్య, తడాల శారదాంబ ఇక్కడే విద్యాభ్యాసం చేశారు.

వజ్రోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

రెండురోజులపాటు నిర్వహించే వజ్రోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థలదాత బిరుదా సూర్యనారాయణ మనవడు, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొండా సూర్యనారాయణ(చంటిబాబు) ఆధ్వర్యంలో గ్రామస్తులు, పూర్వవిద్యార్థులు సమష్టిగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పాఠశాల అభివృద్ధికి నిధులు సేకరిస్తున్నారు. పాఠశాలచరిత్రపై ప్రత్యేక స్మారకాన్ని విడుదల చేయనున్నారు. విద్యారంగంలో పాఠశాల సాధించిన విజయాలు, గుర్తింపు పొందిన విద్యార్థుల వివరాలను పొందుపర్చనున్నారు. పాఠశాల ఆధునికీకరణకు కొత్త ప్రణాళికలను రూపొందిస్తున్నారు. డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం వంటి ఆధునిక వసతులు సమకూర్చేందుకు పూర్వవిద్యార్థులు ప్రయత్నిస్తున్నారు.




సత్యసూర్యతేజ, మహింత్ నాయక్

'ఆదిత్య' విద్యార్థుల హవా

కాకినాడ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల హవా కొనసాగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏబీవీవీ సత్యసూర్యతేజ, బి.మహింత్‌నాయక్ 596, 53 మంది 590 పైన, 465 మంది 550 పైగా మార్కులు సాధించినట్లు ఆదిత్య డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

పాదగయలో దేవదాయ శాఖ అదనపు కమిషనరు పూజలు

పిఠాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని దేవదాయ శాఖ అదనపు కమిషనరు చంద్రకుమార్ బుధవారం సాయంత్రం సందర్శించారు. సతీసమేతంగా కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. చంద్రకుమార్ దంపతులను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు. ఉప కమిషనరు రమేష్‌బాబు, సహాయ కమిషనరు కుర్రాకుల శ్రీనివాస్, దేవదాయ శాఖ జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు పాల్గొన్నారు.



గీతిక



స్నేహిత్



అర్చన రేఖ



రుత్విక

'పది' ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యా ర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. నందవరపు భానుతేజస్ 594, సామిరెడ్డి గీతిక 593, కడిమి అర్చనరేఖ 592, సకురు రుత్విక 592, మాదాన స్నేహిత్ 590 మార్కులు సాధించి అగ్రగాములుగా నిలిచారని విద్యాసంస్థల సం యుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటుతున్నారని, అదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా కొనసాగించి మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన వీరందరూ భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. 550కిపైగా 91 మంది, 500కి పైగా 155 మంది మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధి నేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రధానోపాధ్యాయులు డీవీ శ్రీనివాస్, సీతారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



భానుతేజస్‌ని అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

దివ్యాంగత్వం చదువుకి అడ్డంకి కాదని నిరూపించిన లావణ్యలక్ష్మి




లావణ్యలక్ష్మిని ఫోనులో అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగత్వం చదువుకు ఎంత మాత్రం అడ్డంకి కాదని దివ్యాంగురాలైన ఆకుల లావణ్యలక్ష్మి నిరూపించింది. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవర పేటకు చెందిన లావణ్యలక్ష్మి 345 మార్కులు సాధించింది. ఆమెకు కలెక్టర్ ప్రశాంతి ఫోన్ చేసి అభినందించారు. తనను కలవాలని లావణ్య కోరగా దీనిపై స్పందించిన కలెక్టర్ మీ ఇంటికి నేనే స్వయంగా వస్తానని హామీ ఇచ్చారు. చదువు కొనసాగించాలని, తగిన ఉద్యోగ భద్రత కల్పిస్తామని అన్నారు. దూర విద్య ద్వారా డిగ్రీ సాధించడంపై దృష్టిపెట్టాలని సూచించారు.

'తిరుమల' విద్యార్థుల విజయభేరి



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో తిరుమల ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. యేలూరి లాస్యశ్రీసాయి 597, ఉప్పాల జశ్వంత్‌పవన్, సీహెచ్ సుప్రాంత భరద్వాజ్, కొట్టిస దుర్గకశ్యప్, కూసుమంచి శ్రీవల్లి 596, దేవిరెడ్డి చైతన్య సహస్ర, చాగంటి లాస్య హర్షిత, సారిక నందిని 595, మేకా వంశిత, ఈడుపుగంటి దివ్యశ్రీ, భార స్వాతిక, కూర్మాల తారక సాయిసూర్యఫణిశ్రీ వసంత్, లోట్ల హన్సిజ 594 మార్కులు సాధించారు. 590కు పైగా 41మంది, 580కు పైగా 326 మంది, 570కు పైగా 652 మంది, 560కు పైగా 900 మంది, 550కు పైగా 1079 మంది, 500కు పైగా 1458 మంది మార్కులు పొంది నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు నున్న సరోజనీదేవితో కలిసి ఆయన అభినందించారు.

పుట్టుమిర్చి



ప్రయోగాత్మకంగా సాగు

» మూడు దశాబ్దాల క్రితం దేశ, విదేశాల్లో ప్రసిద్ధి

» రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎన్ఐఆర్‌సీఏ కృషి

ఒకప్పుడు దేశ, విదేశాల్లో పుట్టుమిర్చిగా ప్రాచుర్యం పొంది కనుమరుగైన పుట్టుమిర్చి రకాన్ని మరలా రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జన్యుపరమైన కొన్ని మార్పులతో దీనిని తెగుళ్లకు తట్టుకునే రీతిలో వంగడాన్ని తయారు చేసి ప్రయోగాత్మక సాగు చేపట్టారు.

పిఠాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పుట్టుమిర్చి, గొల్లప్రోలు మిరపగా ప్రసిద్ధి గాంచిన మిర్చి రకం పూర్తిగా కనుమరుగైంది. పుట్టుమిర్చి రకాన్ని రాష్ట్రంలో ఎక్కువగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలు, పిఠాపురం మండలంలోని కొన్ని గ్రామాల్లో సాగుచేసేవారు. దీనికి దేశంలోని మిర్చి మార్కెట్లతో పాటు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండేది. అప్పుడు ఈ రకాన్ని ఎగుమతి చేసేందుకు గొల్లప్రోలు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా మిర్చి గొడౌన్ నిర్మించారంటే దానికున్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ రకానికి తెగుళ్లు అధికంగా వ్యాప్తిచెందడంతో దాదాపు కనుమరుగైంది. అనంతరం కొన్ని మార్పులతో దుర్గాడ పొట్టి మిరపగా ప్రాచుర్యం పొందింది. ఇక్కడ పండే పంటను అరబ్ దేశాలకు అధికంగా ఎగుమతి చేసేవారు. గత ఐదేళ్లుగా తెగుళ్ల బెడద, డిమాండ్ లేకపోవడంతో వీటి ఎగుమతులు తగ్గిపోయాయి. ఈ రకాలన్నింటికీ తొలి రకంగా ఉన్న పుట్టుమిర్చికి మళ్లీ ప్రాచుర్యం కల్పించాలని రాజమహేంద్రవరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ సంస్థ నిర్ణయించింది. మూడు దశాబ్దాల క్రితం వరకు ఈ రకం మిర్చి రకాన్ని తెగుళ్ల తట్టుకునే విధంగా అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. అందులో భాగంగా అభివృద్ధి చేసిన పుట్టుమిర్చి అధునాతన రకాన్ని కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కోలంకలో 50 సెంట్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. ఎన్ఐఆర్‌సీఏ సంస్థ సైంటిస్టులు అందించిన సూచనలకు అనుగుణంగా రైతులు సాగు ప్రారంభించగా ప్రస్తుతం కాయ దశకు చేరుకుంది. ఈ సాగు సత్ఫలితాలిస్తే ఈసారి విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలని ఆ సంస్థ భావిస్తోంది. తెగుళ్ల తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే విధంగా దేశవాళీ రకం అయిన పుట్టుమిర్చిని అభివృద్ధి చేస్తే సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.



పిఠాపురం మండలం కోలంకలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న దేశవాళీ రకం పుట్టుమిర్చి

పోలవరం ఎడమ ప్రధాన కాలువ

పనుల్లో వేగం ఏది?

స్థానిక సమస్యల నెపంతో కాలయాపన

మంత్రి నిమ్మల ధ్వజం


అన్నవరంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

అన్నవరం/కిర్లంపూడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తికి లక్ష్యాలు నిర్దేశించినా అనుకున్నంత వేగం కనిపించడంలేదని జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా అన్నవరంలో బుధవారం జరిగిన సమా వేశంలో అయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు సాకు చూపి కాలయాపన చేస్తున్నట్టు గుర్తించానని వీటి పరిష్కార బాధ్యత స్థానిక శాసనసభ్యులు, మంత్రులతో చర్చించి పనులు పూర్తిచేయాలన్నారు. 2024 నవంబరులో పనులు అప్పగించినా తగినంత యాంత్రీకరణ, మ్యాన్‌పవర్ లేదని త్వరితగతిన సమకూర్చుకోవాల న్నారు. పనుల కాంట్రాక్టులు విడివిడిగా టెండర్లు పిలిచినా నాలుగైదు ఫేజ్‌లు ఒకేసంస్థ నిర్వహిస్తుందని అయితే పనులు వేగవంతం చేయకపోతే కాంట్రక్టర్లపై చర్యలు తీసుకోవడమే కాకు ండా అధికారులను బాధ్యులను చేయడం జరుగుతుందన్నారు. ఎండాకాలంలోనే పనులు వేగవంతం చేయకపోతే వర్షాలు పడితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అంతకముందు బెండపూడి సమీపంలో పంపా ప్రాజెక్ట్ మధ్యలో నిర్మిస్తున్న ఆక్విడెక్ట్ పనులను పరిశీలించారు. అలాగే కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో పోలవరం ఎడమ కాలువ పీకేజీ 3 పనులను మంత్రి పరిశీలించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి,తోట గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి అదుపులో డయేరియా

చేబ్రోలులో ఐదు వైద్య బృందాల ఏర్పాటు : కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డయేరియా పూర్తి అదుపులో ఉందని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు. బుధవారం ఆయన ఆ గ్రామంలో పర్యటించి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను, తాగునీటి సరఫరా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చేబ్రోలు పీహెచ్‌సీలో 5 రోజుల వ్యవధిలో 29 డయేరియా కేసులు వచ్చాయని చెప్పారు. ఇంటింటా సర్వేలెన్స్ కోసం 5 వైద్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక ఫంక్షన్‌లో మాంసాహారం తినడం వల్ల కేసులు వచ్చినట్టు భావిస్తున్నామని చెప్పారు. బుధవారం కొత్తగా కేసులు నమోదు కాలేదని తెలిపారు. 8 తాగునీటి శాంపిల్స్ సేకరించామని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కాగా ప్రైవేటు ఆసుపత్రులో పలువురు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఇంకా చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

సెలవుల్లోను టైమ్ టేబుల్ ఉండాలి

సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోను విద్యార్థులు టైమ్ టేబుల్ కలిగి ఉండాలని సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు సెలవులను సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు 16 ఏళ్ల నిండేవరకూ తల్లిదండ్రులు వారి పెంపకంలో బాధ్యత కలిగి ఉండాలని, నైతిక విలువలు, సమాజంలో నడచుకోవలసిన తీరు బోధించవలసిన బాధ్యత వారిదేనని చెప్పారు. ముంబాయి భవన్స్ కార్యనిర్వాహక కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ జగదీష్ లఖాని, పాఠశాల చైర్మన్ విశ్వనాథరాజు, సామంతపూడి రామరాజు, భవన్స్ భీమవరం కేంద్ర ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

28 నుంచి ఆందోళనలు : ఆదివాసీ సంక్షేమ ఉద్యోగ సంఘం

రంపచోడవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ ఉద్యోగ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.ఆదిరెడ్డి, కె.అగ్గిదొర బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో నెం.3ను సుప్రీంకోర్టు రద్దుచేసిన సాకుతో ప్రభుత్వం గిరిజన యువతకు అన్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ప్రత్యేక గిరిజన జిల్లాగా అల్లూరి జిల్లా పరిధిలోనే గిరి జన ప్రాంతం అంతా ఉన్నా, గిరిజన జిల్లాను యూనిట్‌గా తీసుకోకుండా పూర్వపు జిల్లానే యూనిట్‌గా తీసుకుని అన్యాయం చేసిందన్నారు. గిరిజనులకు న్యాయం చేయాలన్న దృక్పథానికి భిన్నంగా ప్రభుత్వంలోని అధికారులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఐటీడీఏలను యూనిట్‌గా చేసుకుని ఇక్కడి పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ చేపట్టాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా అధికారులు వ్యవహరించారన్నారు. ఈ అంశంపై ఆదివాసీ సంఘాలతో కలిసి ప్రభుత్వం గిరిజన యువతకు న్యాయం చేయాల న్న డిమాండ్‌తో ఐటీడీఏలు యూనిట్లుగా ప్రత్యేక డీఎస్సీ చేపట్టాలని కోరుతూ ఈనెల 28 నుంచి ఆందోళనలకు దిగుతున్నామని, ఆరోజున రంపచోడవరంఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తామన్నారు.

అన్నవరం ఘాట్‌రోడ్డులో పెళ్లి బృందానికి తప్పిన ప్రమాదం

అన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఘాట్‌రోడ్డులో బుధవారం పెళ్లి బృందానికి ప్రమాదం తప్పింది. నర్సీపట్నం నుంచి 55 మంది పెళ్లిబృందంతో ఆర్టీసీ బస్సు కొండపైకి ఎక్కుతుండగా యాక్సిల్ విరిగిపోవడంతో డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించి నిలుపుదల చేయడమే కాకుండా బస్సు కిందకు దొర్లకుండా పెద్దరాళ్లను అడ్డుపెట్టారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సెక్యూరిటీ సిబ్బంది ట్రాక్టర్ సాయంతో బస్సును పక్కకుపెట్టారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

అన్నవరం ఈవోతో దేవదాయ అడిషనల్ కమిషనర్ సమావేశం

అన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వివాదాల నేపథ్యంలో విచారణకు విచ్చేసిన దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ బుధవారం ఈవో వీర్ల సుబ్బారావుతో అరగంటసేపు వినాయక అతిథిగృహంలో సమావేశమయ్యారు. ఉద్యోగుల్లో వ్యతిరేకత రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ విచారణలో ఎక్కడా అవినీతి ఆరోపణ ఉన్నట్టు లేదని, ఉన్నతశ్రేణి సిబ్బందిని పనిచేయాలనే ఒత్తిడితోనే ఈ వివాదాలు వచ్చాయని తమ ప్రాథమిక విచారణలో తేలినట్టు అడిషనల్ కమిషనర్ నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం

ఏలేశ్వరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా యర్రవరం ఏలేరు కాలువలో బుధవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలు పూర్తిగా తెలియరాలేదు. కాలువ తుప్పల్లో ఉన్నట్టు స్థానికులు వెల్లడించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు వెల్లడించారు.

వచ్చే నెల 7 నుంచి

సత్యదేవుని కల్యాణోత్సవాలు

- 8న రాత్రి దివ్యకల్యాణం, భక్తులు వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్‌లు
- అక్షింతల కోసం వివిధ ప్రాంతాల్లో 9 కౌంటర్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖలకు లక్ష్యాలు
- ఏర్పాట్లపై దేవస్థానం అధికారుల సమీక్ష సమావేశం


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఈవో, చైర్మన్, ప్రత్తిపాడు సీఐ

అన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం పూర్తిగా నిమగ్నమయ్యారు. మే నెల 7 నుంచి 13 వరకు వార్షిక కల్యాణోత్సవాలు జరగనుండగా 8న రాత్రి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ప్రత్తిపాడు సీఐతో పాటుగా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా 8వ తేదీన తెలుగురాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కల్యాణం వీక్షించేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో వివిధ శాఖల అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. 23 అంశాల అ జెండాగా ప్రవేశపెట్టిన ఈ సమావేశంలో దేవస్థానం అధికారులతో పాటుగా 9 శాఖలు భాగస్వామ్యం కానున్నాయి. కల్యాణోత్సవాల్లో ప్రతిరోజు వైదిక కార్యక్రమాలు నిర్దిష్ట సమయంలో నిర్వహించాలని, ఈ బాధ్యతను వైదికకమిటీ, ఇద్దరు ఏఈవోలు, ఇద్దరు సూపరింటెండెంట్లకు అప్పగించారు. 8న కల్యాణం రోజున బ్లాక్‌లు వారీగా ఏర్పాటుచేసి ప్రముఖులు, ఇతరులకు నిర్దేశించిన ప్రదేశాల్లో క్యూలైన్ వ్యవస్థ దేవస్థానం ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. కల్యాణం అనంతరం వేదికవద్దకు ఎవ్వరూ అక్షింతల కోసం రాకుండా వివిధ ప్రాంతాల్లో 9 కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతలు, ప్రసాదవితరణ చేయాలని సూచించారు. అన్ని వైపుల నుంచి భక్తులు కల్యాణోత్సవాలు వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరందించాలని సేవాసంస్థల సభ్యుల సహకారంతో పాటుగా వాటర్‌వర్క్స్ విభాగం బాధ్యతలు తీసుకోవాలన్నారు. కల్యాణంరోజున భక్తులను ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాట్లను దేవస్థానం రవాణావిభాగం పర్యవేక్షించాలని సూచించారు. కల్యాణోత్సవాల వారంరోజులు కొండదిగువన జరిగే గ్రామసేవల బాధ్యతలు డీఈలకు అప్పగించారు. వారంతా వాహనసేవల్లో వినియోగించే వాహనాల ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ తీసుకోవాలని పేర్కొన్నారు.

ఏఏ శాఖలకు..ఏ బాధ్యతలు..

గ్రామసేవల సమయంలో, రత్నగిరిపై కల్యాణోత్సవ వేళ ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసే బాధ్యతను పోలీస్‌శాఖకు అప్పగించారు. ప్రధానంగా 11న జరిగే పెద్ద రథం ఊరేగింపు సాయంత్రం 4గంటలకు ప్రారంభించాలని సూచించారు. గ్రామసేవలు జరిగే సమయాల్లో వాహనాలను బైపాస్ రోడ్డు గుండా మళ్లించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌ను నిర్దేశిత ప్రాంతాల్లో ఉంచాలని దీనికి సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. సత్యదేవుని చక్రస్నానం రోజున పంపా రిజర్వాయిర్‌లో తగినంత నీటినిల్వ ఉండేలా చూడాలని ఇరిగేషన్‌శాఖకు... కల్యాణోత్సవాలు, ఊరేగింపుల సమయంలో గ్రామంలో, కొండపైన విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. 24 గంటలు కొండపైన, మెడికల్ క్యాంప్‌లతో పాటుగా 108 అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని వైద్యఆరోగ్యశాఖకు.. స్వామి కల్యాణంరోజున, శ్రీపుష్పయోగం రోజున ఫైరింజన్ అందుబాటులో ఉంచాలని ఫైర్‌శాఖకు, నిరంతరాయంగా ఆర్టీసీబస్సులు నడపాలని, ఆర్టీసీ అధికారులకు కల్యాణం రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామంలో మద్యందుకాణాలు మూయించడమే కాకుండా మిగిలిన రోజుల్లో గ్రామసేవల సమయంలో మద్యం దుకాణాల వద్ద అవాంఛనీయసంఘటనలు లేకుండా చూడాలని ఎక్సైజ్‌శాఖకు... గ్రామంలో శానిటేషన్, ఊరేగింపు సమయంలో పసుపునీళ్లతో శుభ్రం చేసే బాధ్యతను, మెయిన్‌రోడ్డులో సెంట్రల్‌లైటింగ్ మరమ్మతులు, 11న రథోత్సవంలో మెయిన్‌రోడ్డుపై ఉన్న దుకాణసముదాయాలు మూయించే బాధ్యతను పంచాయితీకి అప్పగించారు.

మైనర్‌పై యువకుడి అత్యాచారం

పోక్సో కేసు నమోదు

అన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన యువకుడు మైనర్‌పై అత్యాచారం చేయడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. అన్నవరానికి చెందిన కోర్ల సతీష్ (20) 15 రోజుల క్రితం మైనర్‌పై ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసి అఘాయిత్యానికి పాల్పడగా బాలిక అనారోగ్యానికి గురైంది. దీంతో విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ హరిబాబు పోక్సో కేసు నమోదు చేయగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

నకిలీ బంగారం తాకట్టుతో బ్యాంకుకు బురిడీ

సామర్లకోట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలోని ప్రముఖ బ్యాంకులో నకిలీ బంగారం తనఖా పేరిట సుమారు రూ.30 లక్షలు మేర బురిడీ కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకు ఉన్నతాధికారుల్లో కొంతకాలంగా అంతర్గతంగా జరుగుతున్న దర్యాప్తులో బుధవారం బ్యాంకు రీజినల్ ఉన్నతాధికారి చేరుకుని స్థానిక బ్యాంకు సిబ్బందిని విచారించినట్లు తెలిసింది. నకిలీ బంగారం బ్యాంకులో తనఖా పెట్టడంలో ఖాతాదారుడికి బ్యాంకు అప్రయిజర్‌కు మధ్య ఉన్న అంతర్గత ఒప్పందం కారణంగా లక్షలాది రూపాయలు మేర రుణం మంజూరు చేసినట్లు తెలిసింది. సదరు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడంలో కాలయాపన చేయడం, రెన్యువల్ చేయించుకోకపోవడం వంటి సంఘటనలతో బ్యాంకు అధికారులు తనఖాలో ఉన్న బంగారంపై అనుమానాలు వచ్చి మరింత లోతుగా పరిశీలన చేసినట్లు, అది నకిలీ బంగారంగా నిర్ధారించినట్లు తెలిసింది. కాగా ఈవిషయంపై బ్యాంకు అధికారులు గోప్యంగా ఉంచారు. సదరు అక్రమాలకు పాల్పడిన ఖాతాదారుడి ఆచూకీ కోసం పోలీసుల సహాయాన్ని బ్యాంకు అధికారులు కోరినట్లు తెలిసింది.

అదనపు కట్నం కోసం బెదిరింపులు

భర్త, బంధువులపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురాకపోతే చంపేస్తానని బెదిరిస్తున్న భర్త, అతడి బంధువులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన జొన్నకూటి నాగవంశీకి 2021 అక్టోబర్ 9న అదే గ్రామానికి చెందిన రఘుబాబుతో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.5లక్షల కట్నం, 5 కాసుల బంగారం అందించారు. కొంతకాలం తరువాత భర్త, అత్త, బావగారు, తోటికోడలు అధిక కట్నం తీసుకురమ్మని గొడవపడుతూ లేకపోతే చంపేస్తామని బెదిరిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని నాగవంశీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్‌సాంబమూర్తి తెలిపారు.

అత్తింటి వేధింపుల తాళలేక వివాహిత ఆత్మహత్య

అల్లవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పంది. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లి శివారు దేవరపల్లికి చెందిన బీమాల అనసూయాదేవి (35) తన అత్తింటి వద్ద డి.రావులపాలెం గ్రామంలో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అనసూయాదేవిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. దీనికి ఆమె అత్తమామలు, భర్త వేధింపులే కారణమని అనసూయాదేవి తల్లి యాళ్ల లక్ష్మీనరసింహం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనసూయాదేవి భర్త బీమాల వెంకటకాశీప్రసాద్, అత్తమామలు దుర్గారావు, సూర్యావతిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ డి.రావులపాలెంలో దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రుళ్లు వచ్చి.. మొత్తం దోచేసి..

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

చోరీ సొత్తు, కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ స్వాధీనం


దేవరపల్లిలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వర్‌నాయక్

దేవరపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో సీఐ బి.నాగేశ్వర్ నాయక్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న తెల్లవారుజామున 3గంటలకు దేవరపల్లి మేయిన్‌రోడ్డులో కొంతమంది యువకులు నెంబర్ ప్లేట్‌లేని కారులో వచ్చి ఆర్‌కే ఫొటో స్టూడియోలో తాళాలు పగలకొట్టి విలువైన కెమెరాలు, ల్యాప్‌ట్యాప్, 2హార్డ్‌డిస్క్‌లు, ప్రింటర్‌లు దొంగిలించారు. అదే రోజు నిడదవోలులో రెండు స్టూడియోల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. వీటి విలువ రూ.5లక్షలు. నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు చోరీసొత్తును, కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన షేక్ సమీర్, విజయవాడకు చెందిన ప్రసాదంపాడు అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్, తెలంగాణ రాష్ట్ర కోదాడకు చెందిన నాగ దాసరి ఓమెసిమస్, చిలకలూరిపేటకు చెందిన రామిశెట్టి దేవిప్రసాద్, తెలంగాణ కోదాడకు చెందిన మునగంటి గోపి, పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన కొల్లి వెంకటసూర్య సత్యమణిసాయికీర్తనలను నిందితులుగా గుర్తించారు. వారిలో ఏ1 షేక్ సమీర్‌పై గుంటూరులో 2 మర్డర్ కేసులు, గుంటూరు, టంగుటూరు, కడియం, పోలీస్‌స్టేషన్స్‌లో పలు దొంగతనాల కేసులు, రౌడీషీట్ కూడా ఉంది. ఏ2 అల్లాడి మణికంఠ ఈశ్వర్‌పై గుంటూరు, విజయవాడ, మిరియాలగూడ, కర్నూలు, కడియం, పోలీస్‌స్టేషన్స్‌లో పలు దొంగతనాల కేసులు, గంజాయి రవాణా కేసు కూడా ఉంది. ఏ3 నాగదాసరి ఓమసిమస్‌పై కోదాడ, గుంటూరు, విజయవాడ, మిరియాలగూడ, కర్నూలు, కడియం పోలీస్‌స్టేషన్స్‌లో పలు దొంగతనాలు కేసులు, రౌడీషీట్ కూడా ఉంది. ఏ5 మునగంటి గోపిపై కోదాడ, గుంటూరు, విజయవాడ, మిరియాలగూడ, కర్నూలు, కడియం పోలీస్‌స్టేషన్స్‌లో పలు దొంగతనాల కేసులు, రౌడీషీట్ ఉంది. నిందితులు ముందుగా మంగళగిరిలో కారును అద్దెకు తీసుకుని కారునెంబర్‌ప్లేట్ తీసేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగతనం చేసే ప్రదేశాన్ని ముందుగా రెక్కీ నిర్వహిస్తారు. తరువాత కొన్నిషాపులు, ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుని రాత్రి సమయాల్లో ఇనుపరాడ్లువంటి పరికరాలు ఉపయోగించి షట్టర్లు, తాళాలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడతారు. వారు దొంగతనాలకు పాల్పడిన దేవరపల్లి, నిడదవోలు ప్రాంతాల్లో సీసీకెమెరాల్లో నమోదు కావడం ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించి పట్టుకోవడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. వారు దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో చోరీసొత్తుతో పరారవుతుండగా బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన పోలీసులను అభినందించారు. ప్రతిభ చూపిన దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, గోపాలపురం ఎస్ఐ సతీష్‌కుమార్ వారికి సహకరించిన హెడ్‌కానిస్టేబుల్ భీమరాజు, కానిస్టేబుల్స్ బాలచంద్రరావు, సలీం, పండు, దుర్గారావు, స్వామి, నాగేంద్ర, వెంకట్‌లను రివార్డుకు సిఫార్సు చేయనున్నట్టు పేర్కొన్నారు.

2 నుంచి రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహణ : కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట లోని ఎన్టీఆర్ బీచ్‌లో ఏపీ రాష్ట్ర అంతర్ జిల్లాల 12వ బీచ్ కబడ్డీ పోటీలు-2025 నిర్వహించనున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రకటించారు. బుధవారం వలసపాకల గంగరాజునగర్‌లోని జనసేన కార్యాలయంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 208 మంది పురుష, మహిళా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామని చెప్పారు. తొలుత జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలోని బైసరన్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన 28 మంది పర్యాటకులకు 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు 3 రోజులు సంతాప దినాలు పాటిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు తుమ్మలపల్లి నారాయణరావు (నాని), జనసేన నాయకులు పాండ్రంకి రాజు, తాటికాయల వీరబాబు పాల్గొన్నారు.

లారీని కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు


మరణించిన చక్రవర్తి

గొల్లప్రోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలో 216వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో వ్యక్తి మరణించగా, మరొకరికి గాయాలయ్యాయి. విశాఖ జిల్లా సింహాచలం ఎస్ఆర్‌పురం ఏరియాకు చెందిన గుంపిన కల్యాణ చక్రవర్తి, అతడి చిన్నాన్న కుమారుడు రవితేజ అనకాపల్లిలో స్నేహితుడి వద్ద కారు తీసుకుని కాకినాడ బయల్దేరారు. ఈ కారును మరొక స్నేహితుడికి కాంట్రాక్టు పద్ధతిన అద్దెకు ఇచ్చేందుకు వారు వెళ్తున్నారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలోకి వచ్చేసరికి బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. డ్రైవర్ పక్క సీటులో ఉన్న కల్యాణ చక్రవర్తికి తీవ్ర, డ్రైవింగ్ చేస్తున్న రవితేజకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి హైవే అంబులెన్స్‌పై తీసుకువచ్చారు. అప్పటికే కల్యాణ చక్రవర్తి చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారు. రవితేజ చికిత్స పొందుతున్నాడు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న వ్యాన్

డ్రైవర్ మృతి


ప్రమాద స్థలంలో వ్యాన్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జాతీయ రహదారి 16పై బుధవారం జరిగిన ప్రమాదంలో తమిళనాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్ మరణించాడు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి పుంతరోడ్డు నేషనల్ హైవే అథారిటీకి చెందిన వాటర్ ట్యాంకర్ ద్వారా జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు నీరు పోస్తున్నారు. అదే సమయంలో విశాఖపట్టణం నుంచి చెన్నైకు ఎల్‌అండ్‌టీ కంపెనీకి చెందిన కనస్ట్రక్షన్ మెటీరియల్ తీసుకెళ్తున్న ఐషర్ వ్యాన్ వేగంగా వెనుక నుంచి ఢీకొంది. తమిళనాడు కృష్ణగిరికి చెందిన డ్రైవర్ అమరాసన్‌కు తీవ్ర గాయాలుకావడంతో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఏలేరు కాలువలో గల్లంతైన యువకుడి మృతి



జయబాబు(ఫైల్)

రౌతులపూడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామశివారు ఏలేరు కాలువలో గల్లంతైన గుమ్మరేగులకు చెందిన వింటూరి జయబాబు(29) మృతిచెం దాడు. అతడు మంగళవారం మధ్యాహ్నం గల్లంతు కాగా బుధవారం ఉదయం గుమ్మరేగుల సమీపంలో వంతెన వద్ద మృతదేహం లభించింది. ఎస్ఐ వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా జయబాబు రౌతులపూడిలో సెలూన్ షాపు నిర్వహిస్తుండగా ఇటీవల వివాహం కుదిరింది. మే 29న పెళ్లి ముహూర్తం కూడా నిర్ణయించారు. కానీ ఇంతలోనే మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గోదావరిలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా లంకలగన్నవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి నదిపాయలో వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీఆర్వో పి.నరసింహారావు తెలిపిన వివరాల ప్రకాం.. ఆచంట మండలం కొరుగోరుమిల్లి శివారు ముత్యాలవారిపాలెనికి చెందిన ముత్యాల సత్యనారాయణ(78) ఈ నెల 22న ఉదయం ఉపాధిహామీ పని నిమిత్తం సమీపం గ్రామం కోడేరుకు వచ్చాడు. తిరిగి వెళ్లే సమయంలో ఎండ తీవ్రత తాళలేక గోదావరిలో స్నానానికి దిగడంతో ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైయ్యాడు. నదిపాయలో పడవలో సత్యనారాయణ సైకిల్, పార, దుస్తులను గుర్తించి నదిపాయలో వెతికారు. కాగా బుధవారం తెల్లావారుజామున లంకలగన్నవరం పుష్కరాలరేవులో సత్య నారాయణ మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు వెంకటరామరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు తరలించినట్టు తెలిపారు.

వడగాల్పులకు కార్మికుడి మృతి



ముమ్మిడివరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వడగాల్పులకు తాళలేక కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో ప్రైవేటు పారిశుధ్య కార్మికుడు స్పృహ తప్పి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముమ్మిడివరంలో ప్రైవేటు పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న కాకి లక్ష్మణరావు (70) ఎండ వేడిమిని తాళలేక స్పృహ తప్పి పడిపోవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 25న లైన్స్ మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు చేపట్టనున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు.

మానేపల్లి పాఠశాలకు బీరువా బహూకరణ

పి.గన్నవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మానేపల్లి బాలుర పాఠశాలకు పూర్వ విద్యార్థులు (1986 పదో తరగతి బ్యాచ్) బీరువా బహూకరించారు. కోళ్ళ తిరుమలరావు, తాడి రంగారావు, మొల్లెటి శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటరమణ, పైసత్య నారాయణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

● జిల్లాలో 91.43శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు


జె.అనూష


కె.హారిక

అమలాపురం టౌన్/రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్టు అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవిలు తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయం పరిధిలో 2161 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1940 మంది ఉత్తీర్ణత సాధించారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ఎన్ఎస్ రోహితలాస్య 587 మార్కులు సాధించగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని టి.షైనీహెబ్సిబా 585 మార్కులు సాధించింది. అమలాపురం శ్రీచైతన్య టెక్నోస్కూలు విద్యార్థులు తురగా మధుచంద్రిక 597, మిద్దెల అక్షయ, గాదే శ్రీహర్ష 596, దూనబోయిన సాత్వికశెట్టి 594, తాళ్ల వైష్ణవి, శీలం సూర్యతేజ, సంభాన హర్షిణి 593 మార్కులు, కాశ్లకూరి భవ్యశ్రీ, జగతా జయశ్రీ, గుర్రాల అక్షయ, చెల్లుబోయిన వికాస్వంత్ 592 మార్కులు, ఆకొండి తులసి, దారపురెడ్డి చక్రిక 591, గాలిదేవర సిరి 591 మార్కులు సాధించగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఏజీఎం ఎంవీ సురేష్, ప్రిన్సిపాల్ వసు, రీజనల్ ఇన్‌చార్జి పిల్లా శ్రీనివాస్, కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్, డీన్ అరవ శ్రీను తదితరులు అభినందించారు.

ముమ్మిడివరం 96.25 శాతం

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షల్లో ముమ్మిడివరం మండలం 96.25 శాతం ఉత్తీర్ణత సాధించింది. బాలుర కన్నా బాలికలకే 1.62 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 828 మంది విద్యార్థులకు 797 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 369 మంది బాలురకు గాను 352 మంది (95.33) ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలకు సంబంధించి 459 మందికిగాను 445 మంది (96.95) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ముమ్మిడివరం జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థిని జె.అనూష 582 మార్కులతో మండలంలో ప్రథమ, గాడిలంక జడ్పీ హైస్కూలు విద్యార్థులు వీహెచ్ఎన్ సందీప్ 578 మార్కులతో ద్వితీయ, అదే పాఠశాలకు చెందిన ఎస్వీ రవీంద్ర 576 మార్కులతో తృతీయ స్థానాలు సాధించారు. ప్రైవేటు పాఠశాలకు సంబంధించి శ్రీబాలాజీ హైస్కూలు విద్యార్థిని పోతుల శరణ్య 595 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, జిల్లాలో తృతీయ స్థానం సాధించింది. అలాగే భాష్యం హైస్కూలు విద్యార్థిని ఎస్.నాగలక్ష్మీశృతి 593 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా అదే పాఠశాలకు చెందిన పళ్ల జాహ్నవిసత్యసిరి 591 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. మండలంలో కొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి జడ్పీహెచ్ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి శ్రీబాలాజీ, భాష్యం,మాంటిస్సోరి, షిర్డిసాయి, వైదిన్, ఎయిమ్స్ హైస్కూళ్లు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవోలు డి.గౌరీశంకర్, పి.ఉదయభాస్కరరావు తెలిపారు.

పి.గన్నవరం మండలంలో 89.24 శాతం

పి.గన్నవరం: పి.గన్నవరం మండలంలో పదో తరగతి పరీక్షల్లో 89.24శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కె.హెలీనా తెలి పారు. మండల వ్యాప్తంగా 12 హైస్కూల్లు, ఒక గురుకుల పాఠశాల ఉండగా 781మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. వారిలో 697 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రథమస్థానం మానేపల్లి బాలికల పాఠశాల విద్యార్థిని ఏడిద లాస్యప్రియ (582), రెండోస్థానం ఆర్.ఏనుగుపల్లి పాఠశాల విద్యార్థిని పులిదిండి సన(580), తృతీయస్థానం పి.గన్నవరం పాఠశాల విద్యార్థిని సుంకర నాగచైతన్య (572) సాధించారు.

ఇరుసుమండ విద్యార్థికి జిల్లా ఫస్ట్

మలికిపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మలికిపురం మండలంలో ఇరుసుమండ జిల్లాపరిషత్ హైస్కూలులో పదో తరగతి చదివిన కె.హారిక 592 మార్కులతో జిల్లాలో ప్రథమస్థానం పొందింది. అదేవిధంగా అదే పాఠశాలలో చదివిన వీఎల్‌వీ దీపక్ 951 మార్కులో జిల్లాస్థాయిలో రెండో స్థానం పొందినట్టు ఎంఈవో ఎం.విజయశ్రీ తెలిపారు. మండలస్థాయిలో 556 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 528 మంది ఉత్తీర్ణులై 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన హారికను జిల్లా విద్యాధికారులు కలిసి అభినందించారు. మండలంలో మేడిచర్లపాలెం, ఇరుసుమండ నూరుశాతం ఫలితాలు సాధించాయి. పల్లిపాలెం 27 మందికి 26, బట్టేలంక 133కు 129, గొల్లపాలెం 18కి 17, గుడిమెళ్లంక 39కి 37, విశ్వేశ్వరాయపురం 40కు 34, రామరాజులంక 34, 33, చింతలమోరి 46కి 42, ఇరుసుమండ 38కి 38, మేడిచర్లపాలెం 29కి 29, కేశనపల్లి 77కి 76, మలికిపురం ఏఎఫ్‌డీటీ 41కి 34, పడమటిపాలెం 34కి33మంది ఉత్తీర్ణులయ్యారు.

సఖినేటిపల్లి మండలంలో 97.7శాతం

అంతర్వేది: పదో తరగి పరీక్షా ఫలితాల్లో సఖినేటిపల్లి మండలం 97.7శాతం ఉత్తీర్ణత సాధించిందని మండల విద్యాశాఖాధికారి డి.కిశోర్ కుమార్ తెలిపారు. మొత్తం 653 మంది పరీక్షలు రాయగా 638 మంది ఉత్తీర్ణత సాధించారు. వీవీమెరక ప్రభుత్వ పాఠశాలకు చెందిన పిచ్చిక


పి.చైతన్య


బడుగు శ్రీరక్షిత


రావి శైలజా అన్నపూర్ణ


సుంకర జాహ్నవిలక్ష్మి

చైతన్య 577 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే ప్రైవేటు పాఠశాలలు 99శాతం ఉత్తీర్ణత సాధించాయి. శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి పి.ప్రణవి 593 మార్కులు, సెయింట్‌మేరీ స్కూలు విద్యార్థి బి.దివ్యమణిశ్రీ 591, శ్రీచైతన్యస్కూలుకు చెందిన విద్యార్థులు డి.నందిత 591, ఎన్.ప్రిన్సివెసిలీ 589 మార్కులు సాధించారు. వారిని మండల విద్యా.శాఖాధికారులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. గీతామందిరం హైస్కూలులో 558 మార్కులతో కొండా నాగమణిఐశ్వర్య ప్రథమస్థానం సాధించిందని హెచ్ఎం కె.వీరాస్వామి తెలిపారు.

టెన్త్ మండల టాపర్ శ్రీప్రియ

ఉప్పలగుప్తం: మండలంలో టెన్త్‌లో 97శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో కార్యాలయం ప్రకటించింది. ఎనిమిది పాఠశాలల నుంచి 556 మంది పరీక్షకు హాజరుకాగా 541మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లపల్లి హైస్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. మండల టాపర్‌గా గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థిని అక్కల జోషికాశ్రీప్రియ (583) నిలిచింది. అదే పాఠశాల విద్యార్థినులు గనిశెట్టి శేషపద్మవైష్ణవి (580), గనిశెట్టి కరుణసాయిశ్రీసౌజన్య (573) ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

ఐ.పోలవరంలో 97.65 శాతం

ఐ.పోలవరం: 584 మార్కులతో జి.వేమవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.నాగవైష్ణవి ద్వితీయ స్థానం సాధించింది. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 641 మంది పరీక్షలకు హాజరుకాగా 626మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 91మందికి 91 మంది ఉత్తీర్ణులయ్యారు. శ్రీసాయి స్కూల్ విద్యార్థిని ఎ.సుప్రియ 588 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలో 97.65 శాతంగా ఎంఈవో వీధి సురేష్‌బాబు తెలిపారు.

కాట్రేనికోనకు ద్వితీయ స్థానం

కాట్రేనికోన: పది పరీక్షలో కాట్రేనికోన మండలం 98శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచింది. కందికుప్ప జడ్పీ హైస్కూల్ విద్యార్థిని బడుగు శ్రీరక్షిత 582 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. కందికుప్ప హైస్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది.

అంబాజీపేటలో 94 శాతం ఉత్తీర్ణత

అంబాజీపేట: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు.. 394 మంది పరీక్షలకు హాజరు కాగా 369 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మండల ప్రథమ స్థానం గంగలకుర్రు హైస్కూల్‌కు చెందిన రావి శైలజా అన్నపూర్ణ (589), తొండ వరం హైస్కూల్‌కు చెందిన కేతా శ్రీవీరదుర్గాభాను(584) ద్వితీయ స్థానం, అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన ఎం.రవిరాజు(578)తృతీయస్థానంలో నిలిచారు.

రాజోలులో 90శాతం ఉత్తీర్ణత

రాజోలు: రాజోలు మండలం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 90శాతంతో ఉత్తీర్ణత సాధించిందని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 1535 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 1,339 మంది విద్యార్థులు పాసవగా 196 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు 94శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రైవేటు పాఠశాలలు 99 శాతం ఉత్తీర్ణ సాధించాయని తెలిపారు. మండలంలో 584 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచిన రాజోలు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.జాహ్నవికి అభినందనలు తెలిపారు. రెండు చేతులు లేకపోయినప్పటికీ దివ్యాంగుడైన చెల్లుబోయిన బాబి 291 మార్కులతో సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినందుకు అభినందనలు తెలిపారు.

యానాంలో 96.86 శాతం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో విద్యాశాఖ ఆధీనంలోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత 96.86 శాతం సాధించారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు సీబీఎస్ఈ సిలబస్‌తోను మిగిలిన ప్రైవేటు పాఠశాలలు ఏపీ స్టేట్ సిలబస్‌తో కావడంతో ఏపీ బోర్డు విడుదల చేసిన ఫలితాల ప్రకారం యానాం టాపర్‌గా శ్రీచైతన్య విద్యార్థిని టి.సహస్ర 594 మా ర్కులతో నిలిచింది. నల్లం రెసిడెన్సియల్ పాఠశాల, సాయి విద్యానికేతన్, వివేకనంద, నారాయణ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. శారద విద్యానికేతన్ 93.45, రిజెన్సీ పాఠశాలో 98.67, యానాం పబ్లిక్‌స్కూల్ 94.12, శ్రీచైతన్య 96.77, డ్రీమ్స్ 90శాతం సాధించారు.


అక్కల జోషికాశ్రీప్రియ


ఎ.సుప్రియ

అల్లవరం మండలంలో 92 శాతం

అల్లవరం: అల్లవరం మండలంలో పది ఫలితాల్లో 92శతం ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు తెలిపారు. కొమరగిరిపట్నం హైస్కూలులో సుంకర జాహ్నవిలక్ష్మి 587 మార్కులతో ప్రథమ, 584 మార్కులతో ఎస్.శృతి, కుంపట్ల హారికలు ద్వితీయ, 577 మార్కులతో కట్టా కుసుమప్రియ తృతీయస్థానంలో మండలస్థాయిలో విజయం సాధించారు. అల్లవరం హైస్కూలులో కోలా దీపిక 546, మేడిద ఫణిపూజిత 543, కంకిపాటి మల్లికా దుర్గాదేవి 543 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు.

మామిడికుదురు మండలంలో 95.9 శాతం

మామిడికుదురు: మండలంలోని పది పరీక్షలు 845 మంది విద్యార్థులు రాయగా 810 మంది ఉత్తీర్ణులై 95.9 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు తెలియచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మొగలికుదురు హైస్కూలుకు చెందిన కె.మహాలక్ష్మి 586, కె.శ్రీకళ 586 మార్కులతో మండలంలో మొదటి స్థానాన్ని సాధించగా మామిడికుదురు హైస్కూలు నుంచి కె.జెహరా 576 మార్కులతో ద్వితీయ స్థానం, లూటుకుర్రు హైస్కూలు నుంచి బోనం సత్యమౌళిక్య 574 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి శ్రీచైతన్య మొగలికుదురుకు చెందిన ఎం.సాయిసహస్ర 593, ఎం.అభినాష్ 593, కె.సత్యనరసింహ 593 మార్కులతో మొదటి స్థానాల్లోను, గుంటులోకేష్‌కుమార్ 592 మార్కులతో ద్వితీయ, అదే పాఠశాలకు చెందిన నయినాల స్నిగ్ధరుషిత 591, ఎం.ఆదినారాయణ కృష్ణ 591, కె.మధువల్లీ 591మార్కులతో తృతీయస్థానం సాధించినట్టు ఎంఈవో తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఈవోలతో పాటు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీవీసీలో సీపీఆర్ విధానంపై అవగాహన సదస్సు

అల్లవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గుండెపోటుపై ప్రథమ చికిత్స అవగాహన సదస్సు జరిగింది. విజయ్ కటకం ఫౌండేషన్, బీవీసీ విద్యాసంస్థ ఆధ్వర్యంలో గుండెపోటు వస్తే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స, జాగ్రత్తలపై సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. గుండెపోటువల్లే ప్రపంచంలో మరణాలసంఖ్య పెరుగుతుందని సీఈవో వడ్డాన కిరణ్ అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, డైరెక్టర్ డీపీ రామన్, ఎస్వీ నాయుడు, ఎ.దుర్గామాధురి, డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీపాదరామకృష్ణ పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కంజెస్టడ్ ప్రాంతాల్లో భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించి రూపొందించిన సర్క్యులేషన్ ప్యాట్రర్న్‌పై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఉంటే తెలియజేయాలని నగరపంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు

సఖినేటిపల్లి మండలానికి 3483 కిట్లు

అంతర్వేది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలానికి రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి 3483 సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు రానున్నట్టు సమగ్రశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం తెలిపారు. మోరి హైస్కూలులో స్టాక్ పాయింట్ సమావేశపు హాలులో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కిట్లను భద్రపరిచే ప్రదేశాన్నిపరిశీలించినట్టు తెలిపారు.

950 కుటుంబాలకు డస్ట్‌బిన్‌ల పంపిణీ

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళా సతీష్ అన్నారు. ఇళ్ళలోని తడి, పొడి చెత్తలను వేరుచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించడంలో ప్రతి గృహిణి పంచాయతీకి సహకరించాలని కోరారు. దీనికోసం బుధవారం 950 కుటుంబాలకు రెండు రకాల డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సలాది సతీష్, మెండు శ్రీను పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు

కాట్రేనికోన, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొంతికుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, రెండేళ్లలోపు పిల్లల పోషణపై బుధవారం అవగాహన కల్పించారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. బాల్యవివాహాలతో వచ్చే సమస్యలు, బయట ఆహారంతో అనారోగ్య సమస్యలు, పరిసరాల శుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్ జయవాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లుపాల్గొన్నారు.

నేడు యానాం రానున్న పుదుచ్చేరి కలెక్టర్ బృందం

యానాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తంగన్ గురువారం యానాం పర్యటనకు తొలిసారి రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వస్తున్నారు. ముఖ్యంగా యానాంలో చోటుచేసుకున్న ప్రధాన చెత్త సమస్యకు సంబంధించిన అంశాలపై వస్తున్నట్టు తెలుస్తోంది. ఆయనతో పాటు పలువురు అధికారులు యానాం వస్తున్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఇతర అధికారులు చూస్తున్నారు.

రెండో దశ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండో దశ భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్దేశిత గడువు విధించిందని అమలాపురం ఆర్డీవో కె.మాధవి పేర్కొన్నారు. తొలుత బుధవారం అమరావతి నుంచి భూ పరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయ కార్యదర్శి ప్రభాకరరెడ్డి ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ భూయాజమాన్యం, సరిహద్దుల ప్రస్తుత స్థితిని ప్రతిబింబించేలా రికార్డులను నవీకరించడానికి రీసర్వే దోహదపడుతుందన్నారు. భూమి కొలతలు సమాచారాన్ని, సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించడం ద్వారా భూ వివాదాలను పరిష్కరించుకోవచ్చునన్నారు. మే 15 నాటికి ఎఫ్‌పీఓఎల్ఆర్ వెబ్‌సైట్ క్లోజ్ అవుతుందని, ఈ లోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. జూన్ 27 నుంచి మూడో దశ రీసర్వేను ప్రారంభించాలన్నారు. వీఆర్వోలకు వేరే పనులు అప్పగించకుండా రీసర్వే ప్రక్రియలను పర్యవేక్షించి ఆశించిన పురోగతిని సాధించాలని ఆర్డీవో పేర్కొన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు, కె.ప్రభాకరరావు, తహశీల్దార్లు, వీఆర్వోలుపాల్గొన్నారు.


మలికిపురంలో ఎమ్మెల్యే దేవ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

పహల్గాం మృతులకు నివాళి




అమలాపురం గడియారస్తంభం వద్ద, పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ మృతులకు నివాళులర్పిస్తూ బీజేపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, లింగోలు పండు, ఆర్డీఎస్ ప్రసాద్, బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మోకా వెంకటసుబ్బారావు, జగతా శాంతి, చిట్టూరి రాజేశ్వరి, అయ్యల బాషాపాల్గొన్నారు.

ఉగ్రదాడిలో మృతిచెందిన వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలి

పి.గన్నవరం: ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కొవ్వొత్తుల నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతిమండల కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారని ఎమ్మెల్యే తెలిపారు. తొలుత జనసేనపార్టీ క్యాంపు కార్యాలయం నుంచి త్రీరోడ్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మా నేపల్లి అయ్యాజీవేమా, ఎంపీపీ గనిశెట్టి నాగ లక్ష్మి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వ రావు, సా దనాల శ్రీవెంకట సత్యనారాయణ, తిక్కా సత్తిబాబు, పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మలికిపురం: కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇంటివద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మలికిపురం సెంటర్‌లో కొవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు.

ఉగ్రవాద చర్యకు నిరసన

మలికిపురం: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాద చర్యను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఖండించారు. ఇటువంటి పిరికిపంద చర్యలను సమాజం హర్షించదన్నారు. పార్టీ ఆదేశం ప్రకారం మూడురోజులు సంతాప దినాలు పాటిస్తున్నట్టు తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మామిడికుదురు: కశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడి 28 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ జనసేన నాయకులు మామిడికుదురు సెంటర్‌లో బుధవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మామిడికుదురులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తుండూరి బుజ్జి, పెనుమాల లక్ష్మి, గనశాల దీపిక, మద్దింశెట్టి బుజ్జి, మందా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య: నామన

కశ్మీర్‌లో అమాయక ప్రజలపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అని జడ్పీ మాజీ ఛైర్మన్ పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ నామన రాంబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన మగటపల్లిలో స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ అమాయక ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులుజరిపి ప్రాణాలు తీయడం మానవత్వానికి మాయనిమచ్చ అన్నారు.

ఉప్పలగుప్తం: కశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండకు నిరసనగా జనసేన ఆధ్వర్యంలో గొల్లవిల్లి సెంటర్‌లో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వం సమూలంగా నిర్మూలించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇసుకపట్ల జయమణీరఘుబాబు, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, జనసేనకు చెందిన ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, చిక్కం సుధాసూర్యమోహన్, మంచెం బాలకృష్ణ, గుత్తాల సుభాష్‌చంద్రరావు, మద్దింశెట్టి ప్రసాద్, మురమళ్ళ శ్రీను, పైబోడి పండు, బండారు వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను

బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించాలి: కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి రహదారి భద్రతా చర్యలను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర అంతర్గత రహదారులపై ప్రమాదాలు పొంచి ఉన్న, ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను ఆయా శాఖల సమన్వయంతో కారణాలను గుర్తించాలన్నారు. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాదాలు నియంత్రించడానికి అవసరమైతే కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు, సూచికబోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 18 నిండిన విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్సుల మంజూరుతో పాటు హెల్మెట్‌లు ధరించే అంశంపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంతర్గత రహదారుల్లో 20 మెట్రిక్ టన్నులు దాటి ఓవర్‌లోడుతో ఇసుకను సరఫరా చేసే వాహనాలపై కేసులు బనాయించాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. మురమళ్ల జాతీయ రహదారిపై లైటింగ్, భట్నవిల్లి, పేరూరు జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కామనగరువు వద్ద అప్రోచ్ రోడ్లు, టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జిల్లాలో 40 ఏళ్లు పైబడి శిథిలావస్థలో ఉన్న వంతెనల స్థితిగతులపై అధ్యయనంచేసి రానున్న సమావేశానికి నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఎస్పీ బి.కృష్ణారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, సాంకేతిక ఇంజనీర్ సత్య, ఆర్టీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పాల్గొన్నారు.

కొబ్బరి, కోకో పంటలపై రూగోస్ ఉధృతి

● ఇంటిగ్రేటెడ్ ఫెస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి చౌదరి

అంబాజీపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొబ్బరి, కోకో పంటలను రూగోస్(తెల్లదోమ) ఆశించి నష్టాన్ని కలుగచేస్తుందని, వీటి నివారణకు ముందుగా గుర్తించి రైతులు చర్యలు చేపట్టాలని విజయవాడ సెంటర్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ ఫెస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి కేవీ చౌదరి అన్నారు. కేంద్ర, సమగ్ర తెగులు, నిర్వహణ కేంద్ర, వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలోని అంబాజీపేట, అమలాపురం, అల్లవరం మండలాల్లో కొబ్బరితోటలను ఉద్యాన శాఖాధికారులు, ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారుల బృందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుతం కొబ్బరి, కోకో పంటలలో తెల్లదోమ ఉందన్నారు. ఆక్టోబర్, నవంబర్ నెలలో ఈ తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంటుందన్నారు.. వీటిని ముందుగా గుర్తించి రైతులు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అరటి పంటకు సంబంధించి తెగుళ్ళు, పురుగులు ఉన్న ఫోటోలను నేషనల్ ఫెస్ట్ సర్వేలైన్స్ సిస్టమ్ యాప్‌లో అప్లోడ్ చేస్తే నివారణ చర్యలు రైతులకు చేరవేస్తామన్నారు. కొబ్బరి, కోకో పంటలకు సంబంధించి చీడపీడల నివారణపై రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. అంబాజీపేట పరిశోధన కేంద్రం ద్వారా తెల్లదోమ నివారణకు బదనీకలను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని పరిశీలించారు. పరిశోధన కేంద్రంలో బదనీకలు, రూగోస్ తెల్లదోమ ఉధృతి తదితర వాటిని పరిశీలించి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 147 సహకార సంఘాల్లో డిజిటలైజేషన్ పూర్తి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అత్యంత పారదర్శకంగా జవాబుదారీతనంతో విధులు నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కంప్యూటరైజేషన్ చేస్తామని జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం అమలాపురంలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయంలో కంప్యూటరైజేషన్‌పై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 166 సొసైటీలకుగాను 147 సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన 19 సంఘాల్లో త్వరలోనే డిజటలైజేషన్ పూర్తిచేసి రైతులకు మెరుగైన పారదర్శక సేవలు అందిస్తామన్నారు. డీసీసీబీ సీఈవో వీవీ నరసింహారావు మాట్లాడుతూ సహకార సంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డివిజనల్ సహకార అధికారి కె.రాధాకృష్ణ, జనరల్ మేనేజర్ పి.ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ కె.ఆనంద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.రాజారత్నం, సూర్యప్రకాష్, కె.అయ్యప్పశ్రీనివాస్ పాల్గొన్నారు.

'డీఎస్సీలో బీఎడ్ విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలి'

అమలాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో పాల్గొనేందుకు జూలై నెలలో సెమిస్టర్ పరీక్షలకు హాజరై బీఎడ్ పూర్తిచేస్తున్న వారికి ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని బీఎడ్‌ఫైనల్ ఇయర్ విద్యార్థులు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అమలాపురంలో అందజేశారు. ఎస్.రోజా, కె.జయ, శ్రావణి, ఎ.లక్ష్మి, ఏఎస్డీ ప్రియాంక, సౌజన్య కలిసి వినతిపత్రం అందజేశారు.

భవన నిర్మాణరంగ అవసరాలకు

సరిపడా ఇసుక నిల్వ చేయాలి

అమలాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాకాలంలో భవన నిర్మాణరంగ అవసరాలకు సరిపడా ఇసుక నిల్వలను స్టాక్ యార్డుల్లో భద్రపరచాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రహదారులకు దగ్గరిగా ఉన్న ఇసుక రీచ్‌లలో స్టాక్ యార్డులు నిర్వహించి ఇసుకను నిల్వ చేయాలని ఆదేశించారు. రావులపాలెం స్టాక్ యార్డులో 1.10లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే ఉన్నాయన్నారు. గోపాలపురం, జొన్నాడ, అమలాపురం స్టాక్ పాయింట్లలో కూడా గరిష్ఠంగా ఇసుక నిల్వలు చేయాలన్నారు. కొత్తపేటమండలంలో ఐదు సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల నిర్వహణకు సంబంధించి టర్నోవర్ నెట్‌వర్క్ ఇసుక తవ్వకాలు నిర్వణ కోసం తుది నివేదికను రూపొందించాలన్నారు. కపిలేశ్వరపురం మండలంలో ఇసుక సేకరణ కోసం ఆరు రీచ్‌లకుగాను నాలుగు రీచ్‌లకు పర్యావరణ అనుమతులు వచ్చాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, భూగర్భ గనులశాఖ సహాయ సంచాలకుడు ఎల్.వంశీధర్‌రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణమండలి అధికారి శంకరరావు, డీపీవో డి.శాంతలక్ష్మి, ఆర్టీవో డి.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ సువిజయ్, రియాల్టీ ఇనస్పెక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు పరీక్ష

అమలాపురంటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షా ఫలితాలను మే 14న విడుదల చేస్తారు. జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి సంబంధించి 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. వీటితోపాటు ఏపీ రెసిడెన్షియల్, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో పలు కోర్సుల్లో ప్రవేశానికి అదేరోజున ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆయా పరీక్షల నిర్వహణకుగాను జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో రెండు పరీక్షా కేంద్రాల్లో శాంతియుతంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు ఆయా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలోను, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి వెత్సావారి అగ్రహారం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోను పరీక్షా కేంద్రాం ఏర్పాటు చేశామన్నారు. సీసీటీవీ నిఘాలో ఆయా పరీక్షలు జరుగుతాయన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ఐ.పోలవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు బుధవారం ఆవిష్కరించారు. శైవాగమ పండితుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో మే 1 నుంచి 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, దాట్ల ఇంద్రరాజు, పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, అర్చకుడు యనమండ్ర సత్యసీతారామశర్మ పురోహితుడు నాగాభట్ల శ్రీరామశర్మ తదితరులు పాల్గొన్నారు.



స్వశక్తితో ఉన్నత స్థానాలకు ఎదిగి, తమ తమ రంగాల్లో శక్తిమంతులుగా గుర్తింపు పొందిన కొందరు మహిళల జాబితాను 'ఫోర్బ్స్' పత్రిక ఇటీవల విడుదల చేసింది. ఆయుర్వేద ఉత్పత్తుల రంగంలో అంతర్జాతీయ బ్రాండ్ వ్యవస్థాపకురాలైన 69 ఏళ్ల మీరా కులకర్ణి, దేశంలో అత్యున్నత మానసిక వైద్య సంస్థకు డైరెక్టర్‌గా తనదైన ముద్ర వేస్తున్న 64 ఏళ్ల డాక్టర్ ప్రతిమా మూర్తి వారిలో ఉన్నారు.



స్వశక్తి 'సంపన్నులు'

నమ్మకమే ఆమె ధైర్యం

పుట్టిన ఊరైన ఢిల్లీలో, ప్రకృతి సౌందర్యంతో అలరాలే సిమ్లాలోని హాస్టల్స్‌లో ఆడుతూ పాడుతూ గడిచిపోయిన రోజుల తరువాత.... కఠినమైన జీవన వాస్తవికత మీరా కులకర్ణి అనుభవంలోకి వచ్చింది. "దానికి కారణం నేను తీసుకున్న నిర్ణయమే" అంటారామె. మీరాను విదేశాల్లో చదివించాలని ఆమె తండ్రి కోరిక. మరోవైపు పెళ్లి సంబంధం వచ్చింది. "పుట్టిన దేశాన్ని, కన్నవారిని వదిలేసి... కొత్త చోటుకు వెళ్లాలనే ఆలోచన నాకు భయంగా అనిపించింది. అందుకే పెళ్లికి ఒప్పుకున్నాను. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే... 'నాకు ఏమాత్రం తెలియని వ్యక్తిని ఎలా పెళ్లి చేసుకోగలిగాను? అది నాకు భయంగా ఎందుకు అనిపించలేదు?' అనే ప్రశ్నకు నా దగ్గర సరైన సమాధానం లేదు" అని చెబుతారు మీరా. పెళ్ళయ్యాక... ఢిల్లీ నుంచి వ్యాపారస్థుడైన భర్తతో కలిసి చెన్నైలో కాపురం. కానీ అప్పటికే ఆమె భర్త వ్యాపారం నష్టాల్లో ఉంది. దానికి తోడు అతనికి మద్యపాన వ్యసనం. నాలుగేళ్ళు గడిచాక.. భర్త వేధింపులను భరించలేని ఆమె... ఇద్దరు పిల్లలతో మళ్ళీ ఢిల్లీ వచ్చేశారు. చిన్న చిన్న పనులు చేస్తూ, తల్లిదండ్రుల సాయంతో పిల్లల్ని పెంచుతూ, ఒంటరి తల్లిగా మీరా సాగిస్తున్న జీవితం... ఆయుర్వేద సబ్బుల తయారీతో కొత్త మలుపు తిరిగింది.

నమ్మకంతో ధైర్యం చేశాను...

"మన దేశంలో తయారవుతున్న సబ్బుల్లో నాణ్యత లేదని తెలుసుకున్నాక... ప్రాచీన ఆయుర్వేద పద్ధతుల్లో నేనే వాటిని తయారు చేయాలనుకున్నాను. ఋషీకేశ్‌ను ఆయుర్వేదానికి పుట్టినిల్లు అంటారు. అక్కడ నిపుణులను కలిసి... కొన్ని పద్ధతులు తెలుసుకున్నాను. అయితే ఆ పద్ధతుల్లో సబ్బుల తయారీ చాలా ఖరీదైనదే. కానీ ఆ పద్ధతిలో తయారు చేస్తే తప్ప వాటిలో నాణ్యత ఉండదు. మంచి ఉత్పత్తులకు ఆదరణ ఉంటుందని నా నమ్మకం. అందుకే ధైర్యం చేశాను. ప్రయోగాలు కొనసాగించి... కొన్ని సబ్బులు చేశాను. తెలిసిన వారికి, కొన్ని దుకాణాలకు ఇచ్చాను. మెల్లగా మొదలైనా... కొన్నవారే మళ్ళీ మళ్ళీ కొనడం, వారి సిఫార్సుతో కొత్త కస్టమర్లు రావడంతో అమ్మకాలు వేగం అందుకున్నాయి. దాన్ని పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చాలనే ఆలోచన 2000 సంవత్సరంలో వచ్చింది. రెండు లక్షల పెట్టుబడి, ఇద్దరు ఉద్యోగులతో 45 ఏళ్ళ వయసులో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' ప్రారంభించాను" అని గుర్తు చేసుకున్నారు మీరా. ఇప్పుడు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆ సంస్థను నడిపిస్తున్నారు.

> 'డెబ్బై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మికులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు.

వారే ప్రచారకర్తలు

గత పాతికేళ్ళలో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' శరవేగంతో విస్తరించింది. ఒక విదేశీ కంపెనీ పెట్టుబడి పెట్టడంతో కొత్త ఉత్పత్తుల తయారీకి వీలు కలిగింది. ఫేషియల్, బాడీ, వెల్‌నెస్... ఇలా పలు విభాగాల్లో కొన్ని పదుల ఉత్పత్తులను మీరా బృందం రూపొందించింది. లగ్జరీ ఆయుర్వేదిక్ బ్రాండ్‌గా ఖ్యాతి సంపాదించింది. దేశంలో ఈ సంస్థకు 130కి పైగా స్టోర్స్ ఉన్నాయి. 120 దేశాలకు వారి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ క్రమంలో మీరాకు, అమె బ్రాండ్‌కు పలు పురస్కారాలు లభించాయి. దేశంలో ప్రభావవంతమైన మహిళగా 'ఫోర్బ్స్' తదితర జాబితాల్లో మీరా పేరు చోటు చేసుకుంది. ఈ రోజు ఎలాంటి రుణాలు లేని వందల కోట్ల బ్రాండ్‌గా ఆమె సంస్థ నిలిచింది. "డెబ్బై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మికులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు. ప్రకటనలకు ఖర్చు పెట్టం. మా వినియోగదారులే మాకు ప్రచారకర్తలు" అంటారు మీరా. 'ఎసెన్షియల్లీ మీరా' పేరుతో ఆమె రాసిన ఆత్మకథ మంచి ఆదరణకు నోచుకుంది.

మనసు గుట్టు కనిపెడుతూ..

ఎంబీబీఎస్ చెయ్యాలి. డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలి... ఇది ప్రతిమామూర్తి చిన్ననాటి కల. అనుకున్నట్టే బెంగళూరు వైద్య కళాశాలలో సీటు సంపాదించారు. క్రమంగా... ఆలోచనలు, మెదడు మానవులను, వారి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయం మీద ఆసక్తి పెరిగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వెంటనే... 'నిమ్హాన్స్' (జాతీయ మానసిక, నరాల విజ్ఞాన సంస్థ)లో డీపీఎం, ఎండీ (సైకలాజికల్ మెడిసిన్) పూర్తి చేశారు. ఆ తరువాత.... బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో సైకలాజికల్ మెడిసిన్‌లో డిప్లమా చేశారు. అప్పట్లో ఆమె ఆసక్తి వేరే వైద్య విభాగం మీదకు మళ్ళితే... దేశం ఒక గొప్ప సైకియాట్రిస్ట్‌ను కోల్పోయేదంటారు ఆమె గురించి తెలిసిన వైద్య నిపుణులు. తన రంగంలో అత్యున్నతంగా నిలవడమే కాదు... దేశంలోనే అతి పెద్ద మానసిక ఆరోగ్య సంస్థ 'నిమ్హాన్స్'కు డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఆ పదవిని చేపట్టిన రెండో మహిళగా, తొలి మహిళా సైకియాట్రిస్ట్‌గా ఆమె చరిత్రకెక్కారు. 2021లో ఆ బాధ్యతలను ప్రతిమ స్వీకరించిన సమయానికి... దేశం కొవిడ్ కల్లోలంలో ఉంది. "కొవిడ్ మహమ్మారి ఏదో ఒక మేరకు అందరినీ మానసికంగా ప్రభావితం చేసింది. సరైన వైద్య సాయం అందకపోవడం వల్ల ఆ సమస్యలు కొందరిలో కొనసాగుతున్న పరిస్థితిని చూస్తున్నాం" అంటారు ప్రతిమ.

జాతీయ సర్వేకి సారథ్యం...

ప్రత్యక్షంగానైనా, జూమ్ లాంటి మాధ్యమాల ద్వారా అయినా... సమస్యలను ఆమె చాలా ఓపికగా వింటారు. సాధ్యమయ్యే పరిష్కారాలు చెబుతారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ అడిక్షన్ మెడిసన్‌కు అధిపతి, సైకియాట్రీ విభాగాధిపతి, ఇప్పుడు డైరెక్టర్... ఇలా తన వృత్తి జీవితంలో ఏ దశలో ఉన్నా ఆమె నిబద్ధతలో మార్పు లేదు. "నిమ్హాన్స్... కేవలం మానసిక ఆరోగ్యానికి మాత్రమే కాదు.. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, న్యూరో రేడియాలజీ లాంటి అనేక అంశాల్లో సేవలు అందించే సంస్థ. నేను చదువుకున్న సంస్థకే డైరెక్టర్ కావడం నా బాధ్యతను మరింత పెంచింది" అంటున్నారు ప్రతిమ. కరోనా అనంతరం దేశంలోని మానసిక ఆరోగ్య పరిస్థితుల గురించి మరింత తెలుసుకోవడానికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న 'నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే'కి ఆమె సారథ్యం వహిస్తున్నారు. "ఇలాంటి సర్వే మొదటిసారి పదేళ్ళ క్రితం... పన్నెండు రాష్ట్రాల్లో జరిగింది. దేశంలోని ప్రతి పదిమందిలో ఒకరు గుర్తించదగిన మానసిక ఆరోగ్య వైకల్యాలతో బాధపడుతున్నారని, అర్హులైన మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉందని ఆ సర్వే వెల్లడించింది. రెండవది అయిన తాజా సర్వే వివరాలను వచ్చే ఏడాది ప్రచురిస్తాం. గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో, వలస కార్మికుల్లో కొవిడ్ అనంతర పరిణామాలను ఈ సర్వేలో ప్రధానంగా అధ్యయనం చేస్తున్నాం" అని ఆమె చెబుతున్నారు.

> 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పదిమంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు 40 మందిని పోస్ట్ గ్రాడ్యుషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం"

22 భాషల్లో కౌన్సెలింగ్

"మానసిక వైద్యనిపుణులుగా మహిళల సంఖ్య పెరిగి, నాయకత్వ స్థానాల్లో ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పదిమంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు దాదాపు 40మందిని పోస్ట్ గ్రాడ్యుషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం" అంటున్న ప్రతిమ... 'నిమ్హాన్స్'లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. 2022లో కేంద్రం ప్రవేశపెట్టిన 'నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్'కు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. "ఆ ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ ఈ ప్రోగ్రామ్ హెల్ప్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 19 లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. ప్రతి రాష్ట్రంలో సుశిక్షితులైన కౌన్సెలర్లు.. 22 భాషల్లో వారి ఇబ్బందులు విని, సలహాలు ఇస్తారు" అని వివరించారు. ఆమె నేతృత్వంలోనే 'నిమ్హాన్స్'కు ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి కిందటి ఏడాది 'నెల్సన్ మండేలా అవార్డ్ ఫర్ హెల్త్ ప్రమోషన్' లభించింది. వ్యక్తిగతంగా కర్ణాటక ప్రభుత్వం నుంచి 'డాక్టర్ రాజా రామన్న రాజ్య పురస్కారం' సహా అనేక గౌరవాలను ప్రతిమ అందుకున్నారు. 300కు పైగా పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. "వైద్యులు ఉన్నది రోగుల సేవ కోసమే. వారి ఇబ్బందులు తీరే మార్గాలను సూచించాలి. అన్నిటికన్నా వారికి మన పట్ల, మనం అనుసరించే వైద్య పద్ధతుల పట్ల నమ్మకం కలిగించడం ముఖ్యం. నా వృత్తి జీవితంలో నేను కట్టుబడి ఉన్న అంశం అదే" అంటున్నారు ప్రతిమ.

కౌన్సెలింగ్

కొత్త తల్లికి నిస్పృహ ఎందుకు?

డాక్టర్, నాకు ఇటీవలే ప్రసవమైంది. తల్లిని అయినందుకు ఉప్పొంగిపోవడానికి బదులుగా తెలియని నిరాశ, నిస్పృహలు వేధిస్తున్నాయి. నాకు ఎందుకు ఇలా జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్

పేగు తెంచుకుని పుట్టిన పసికందు మీద తల్లికి అవ్యాజ్యమైన ప్రేమ కలగడం సహజమే! కానీ కొందరు బాలింతల్లో 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్' అనే సమస్య తలెత్తుతుంది. ప్రతి ఏడుగురు బాలింతల్లో ఒకరు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ బారిన



పడుతూ ఉంటారు. ఇది ప్రసవమైన వెంటనే కనిపించవచ్చు, లేదా బిడ్డకు ఏడాది వయసొచ్చే లోపు జరగొచ్చు. అయితే ఎక్కువగా ఈ సమస్య ప్రసవమైన 3 వారాల్లోగానే తలెత్తుతూ ఉంటుంది. నిరాశలో కూరుకుపోవటం, జీవితం మీద ఆసక్తి కోల్పోవటం, అకారణంగా ఏడుస్తూ ఉండటం లాంటి లక్షణాలు ఈసమస్యలో కనిపిస్తాయి. ఈ డిప్రెషన్‌కు లోనయిన తల్లులు...బిడ్డను సరిగా చూసుకోలేనేమో, తల్లిగా బాధ్యతను సమర్థంగా నిర్వహించలేనేమో, బిడ్డకు ప్రేమను సంపూర్తిగా అందించలేనేమో అనే చిత్రమైన మానసిక స్థితికి లోనవుతూ ఉంటారు. అయితే ఇలాంటి డిప్రెషన్ గురించి భయపడాల్సిన పని లేదు. ప్రసవంతో హెచ్చుతగ్గులకు లోనయ్యే శరీరంలోని హార్మోన్లు, పూర్వం డిప్రెషన్ బారిన పడి ఉండటం, విపరీతమైన ఒత్తిడితోపాటు, కుటుంబ సభ్యుల తోడ్పాటు కొరవడటం లాంటి కారణాల వల్ల తల్లులు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురవుతారు. అయితే ఈ సమస్యను 'యాంటీ డిప్రెసెంట్స్'తో చికిత్స చేసి సరిదిద్దవచ్చు. ఈ మందులు డిప్రెషన్‌కు కారణమయ్యే మెదడులోని కొన్ని రసాయనాలను సంతులనపరిచి సమస్యను తొలగిస్తాయి. ఈ మందుల వల్ల తల్లి పాలు తాగే పిల్లలకు ఎలాంటి దుష్ప్రభావాలూ కలగవు. కాబట్టి డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
హైదరాబాద్.

పిల్లలను హాస్టల్‌కు పంపే ముందు...

ఒక్కోసారి పిల్లలను చదువు నిమిత్తం పాఠశాల స్థాయిలోనే హాస్టల్‌కి పంపాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తల్లిదండ్రులు ముందుగానే పిల్లలకు కొన్ని విషయాలను నేర్పించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



- పిల్లలకు బాధ్యతగా వ్యవహరించడం నేర్పించాలి. చిన్న చిన్న పనులు చెప్పి చేయిస్తూ ఉంటే వాళ్లకి పనులు చేయడం అలవాటు అవుతుంది.
- సమయానుసారం దినచర్య, వ్యాయామం పూర్తిచేసేలా అలవాటు చేయాలి. క్రమశిక్షణతో ఉండడం నేర్పించాలి.
- పుస్తకాలు సహా దుస్తులు, ఇతర వస్తువులను భద్రపరచుకునే విధానాలు తెలియజెప్పాలి.
- పిల్లలు కొత్త చోట ఉండడానికి భయపడుతూ ఉంటారు. అలాకాకుండా వారిని వెన్నంటి ప్రోత్సహిస్తే ఎప్పటికప్పుడు ఎలాంటి పరిస్థితులతోనైనా సర్దుకుపోవడాన్ని అలవాటు చేసుకుంటారు.
- పిల్లలకు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎలానో నేర్పించాలి. ఏ సందర్భాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియజెప్పాలి. దీంతో వాళ్లు ఎక్కడైనా ధైర్యంగా ఉండగల్గుతారు.
- అనుకోకుండా ఏదైనా పొరబాటు జరిగితే దాని నుంచి పాఠం నేర్చుకోవడం ఎలానో వివరించి చెప్పాలి.
- ఇతరులను గౌరవించడం, స్నేహపూర్వకంగా మాట్లాడడం, సంయమనంతో మెలగడం లాంటివి నేర్పించాలి.
- పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవడం, ఇచ్చిపుచ్చుకునే విధానాల గురించి వివరించాలి.
- బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ నిర్ణీత సమయంలో హోమ్‌వర్క్‌లు పూర్తి చేయడాన్ని అలవాటు చేయాలి.
- చిన్న చిన్న ఆరోగ్య సమస్యల గురించి వివరిస్తూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజెప్పాలి.
- ఆహారం తీసుకోవడం, ఆటలు ఆడడం, చదువుకోవడం, వ్యక్తిగత శుభ్రత లాంటివి పాటించడంలో నిర్లక్ష్యం వహించకూడదని పిల్లలకు వివరించాలి.

'ఆమ్ పన్నా' కొత్తగా



ప్రస్తుతం మనకు పుల్లని పచ్చి మామిడికాయలు లభ్యమవుతున్నాయి. వీటిలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. వీటితో చేసిన 'ఆమ్ పన్నా' తాగితే వేసవి తాపం తీరుతుంది. ఆమ్ పన్నా ఎలా తయారు చేయవచ్చో తెలుసుకుందాం.

తయారీ విధానం

- ఒక చెంచా జీలకర్రను తీసుకొని దోరగా వేయించి చల్లార్చాలి. పది పుదీనా ఆకులు, పావు చెంచా మిరియాలు, రెండు చెంచాల బెల్లపు పొడి, తగినంత ఉప్పును ఒక మూకుడులో వేసి వేయించాలి. జీలకర్ర సహా వీటన్నింటినీ మిక్సీలో మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి.
- రెండు మీడియం సైజు మామిడి కాయలను తీసుకొని... వాటిని ప్రెషర్‌కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. ఈ మామిడి కాయల తొక్కలను తీసి లోపల గుజ్జును తీయాలి.
- ముందుగా చేసుకున్న పొడిని.. ఈ గుజ్జును.. మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దీనిని ఒక కంటైనర్‌లో భద్రపరుచుకోవాలి. ఇది పది రోజుల దాకా పాడుకాదు. కావాలనుకున్నప్పుడు ఈ మిశ్రమాన్ని గ్లాసులో సగం వేసి చల్లటి నీళ్లలో కలుపుకోవాలి. సోడాలో కలుపుకున్నా బాగుంటుంది.
- కేవలం మామిడి రుచి మాత్రమే కావాలనుకొనేవారు పుదీనా ఆకులు వేయాల్సిన అవసరం లేదు.

సెలబ్ ఫిట్

ఆరోగ్యమే అందం

ఆమె గాత్రం... సమ్మోహనాస్త్రం. రాగం... సుస్వరాల సంగమం. బాలీవుడ్ అగ్రతారలకు ఏమాత్రం తీసిపోని అభిమాన గణం. దేశ విదేశీ వేదికలపై తన పాటతో మైమరిపిస్తున్న ప్రముఖ గాయని నేహా కక్కర్. గానంతోనే కాకుండా... రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా... ఫ్యాషన్ ఐకాన్‌గా... యువతరానికి ప్రేరణగా నిలుస్తోంది నేహా. 'మిమ్మల్ని నిత్యనూతనంగా ఉంచుతున్నది ఏంట'ని అడిగితే... క్రమం తప్పని వ్యాయామం, ఆహారపు అలవాట్లే అంటుంది తడుముకోకుండా.



మొన్నామధ్య ఒక వివాదం... ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో కన్సర్ట్‌కు నేహా మూడు గంటలు ఆలస్యంగా వచ్చిందని. ఈ గొడవలో ఇంటా బయట ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. వీటన్నిటినీ మౌనంగా భరించిన నేహా... కార్యక్రమం అయిన కొన్ని రోజులకు అసలు విషయం చెప్పింది... నిర్వాహకులు తనకు, తన బ్యాండ్‌కు అసలు డబ్బులే ఇవ్వలేదని! 'నేను ఆలస్యంగా వచ్చానంటూ నాపై నిందలు మోపారు. కానీ నాకు గానీ, నా బృందానికి గానీ ఏమైందని ఎవరన్నా అడిగారా? నిర్వాహకులు నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పారిపోయారు. నా కోసం వచ్చిన అభిమానులను నిరాశపరచకూడదని ఆ షో నేను ఉచితంగా చేశాను. మాకే కాకుండా సౌండ్ సిస్టమ్ వారికి కూడా పేమెంట్ అందలేదు. దాంతో వారు షో వదిలేసి వెళ్లిపోయారు. ఆఖరి నిమిషంలో నా భర్త రోహన్‌ప్రీత్‌సింగ్ తోడ్పాటుతో కన్సర్ట్ నిర్వహించగలిగాను. వేదిక మీద మాట్లాడినప్పుడు ఈ విషయాలేవీ నేను చెప్పలేదు. కారణం... నావల్ల ఎవరికీ నష్టం జరగకూడదని అనుకున్నాను. కానీ ఇప్పుడు అందరూ తప్పు నాదేనంటూ మాట్లాడుతుంటే... ఆ అపవాదు చెరిపేసుకోవడానికే వాస్తవం ఏమిటో చెప్పాను' అంటూ తన ఆవేదన పంచుకున్న నేహాకు విమర్శలు, ఎత్తిపొడుపులు కొత్తేమీ కాదు. సామాజిక మాధ్యమాల్లో తరచూ ఆమెపై అవాస్తవ కథనాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. భర్తతో విడిపోతుందని ఒకసారి... ఆరోగ్యం విషమించిందని మరొకసారి... ఎవరికి ఇష్టంవచ్చినట్టు వారు దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే వీటన్నిటినీ పక్కన పెట్టేసి తన పని తాను చేసుకొంటూ వెళుతుంది 36 ఏళ్ల నేహా.

గాయకుల కుటుంబం...

ఉత్తరాఖండ్‌లోని రుషికేశ్‌లో పుట్టిన నేహా... నాలుగేళ్ల వయసులోనే పాటలు పాడటం మొదలుపెట్టింది. తమ కూతురి ఆసక్తిని ఆమె తల్లిదండ్రులు గుర్తించారు. తనకు మంచి శిక్షణ ఇప్పించాలని ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డారు. చిన్న చిన్న వేదికలపై ఆధ్యాత్మిక గీతాలు పాడుతున్న నేహా... పదహారేళ్ల వయసులో అన్నయ్యతో కలిసి ముంబయికి వెళ్లింది. ఆమె అన్న టోనీ, అక్క సోను కక్కర్ కూడా గాయకులే. ముంబయి వెళ్లాక 2005లో టీవీ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్2'లో పోటీపడింది. కానీ ఆరంభంలోనే ఎలిమినేట్ అయింది. మూడేళ్ల తరువాత 'నేహా ద రాక్‌స్టార్' పేరిట తొలి ఆల్బమ్ విడుదల చేసింది. అదే ఏడాది సుఖ్వీందర్‌సింగ్‌తో కలిసి 'మీరాబాయ్ నాటౌట్'లో 'హై రామా' గీతం ఆలపించింది. అదే ఆమెకు తొలి సినిమా పాట. ఆ తరువాత తెలుగు, కన్నడ సినిమాల్లో కూడా పలు పాటలు పాడింది. 2012లో విడుదలైన 'కాక్‌టైల్'లో 'సెకండ్‌హ్యాండ్ జవానీ' పాట సూపర్‌హిట్ కావడంతో నేహా కెరీర్ మలుపు తిరిగింది. ఇక అక్కడి నుంచి వరుసపెట్టి ఎన్నో హిట్ పాటలు ఆలపించింది. 'ఇండియన్ ఐడల్' తదితర రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. వీటితోపాటు దేశవిదేశాల కన్సర్ట్లలో తన గాత్రంతో అలరిస్తోంది.



అభిమానం 'కోట్లు' దాటింది...

బాలీవుడ్ అగ్ర తారలకు దీటుగా నేహాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 7.8 కోట్లమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె యూట్యూబ్ ఛానల్‌ను దాదాపు కోటిన్నరమంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఫేస్‌బుక్, ఇతర మాధ్యమాల్లోని అభిమానగణం దీనికి అదనం. ప్రతి పోస్ట్‌కూ లక్షల్లో వ్యూస్, లైక్‌లు. నటుడు హిమాన్ష్ కోహ్లీతో నాలుగేళ్లు ప్రేమాయణం నడిపిన నేహా... అతడిని పెళ్లి చేసుకొంటున్నట్టు కూడా ప్రకటించింది. అయితే కొద్ది రోజుల్లోనే తామిద్దరం విడిపోయామని ట్వీట్ చేసింది. 2020లో పంజాబీ సంగీత కళాకారుడు రోహన్‌ప్రీత్‌సింగ్‌ను పెళ్లాడింది. వృత్తిగత జీవితంలో ఎంత బిజీగా ఉన్నా... వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తుంది ఈ గాయని. రోజంతా తనను తాను ఉల్లాసంగా ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తుంది. ఆహార నియమాలు పాటిస్తుంది. అందుకే కాలం మారుతున్నా... నేహా అందం మాత్రం తరగడంలేదు.

వర్కవుట్ ఇలా...

ఎంత పని ఒత్తిడి ఉన్నా అదేపనిగా కుర్చీకి అతుక్కుపోదు నేహా. ముఖ్యంగా తిన్న తరువాత. గంటలతరబడి కూర్చొంటే ఊబకాయంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఎన్నో చుట్టుముడతాయని అంటుంది ఈ భామ. ఎప్పుడూ చురుగ్గా, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంది. దాని కోసం నిత్యం వ్యాయామాలు చేస్తుంది. జిమ్‌కు వెళ్లామా... లేదా అన్నది ఆమెకు ప్రధానం కాదు. వీలైతే ఇంట్లోనే వర్కవుట్స్ ముగిస్తుంది. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటుంది.

- ఉదయం యోగాతో నేహా రోజు మొదలవుతుంది. బరువు తగ్గడానికి యోగా తనకు ఎంతో సహకరించిందని అంటుంది ఆమె. అంతేకాదు... అదనపు కేలరీలు, కొవ్వు కరిగిపోయి, శరీరం నాజూకుగా తయారవుతుంది. అందుకే తన జీవనశైలిలో యోగా లేని రోజంటూ ఉండదని అంటుంది.
- జాగింగ్, రన్నింగ్. బరువు తగ్గడానికి ఇది మంచి కార్డియో ఎక్సర్‌సైజ్.
- 'వర్కవుట్స్ కోసం జిమ్ మీద ఆధారపడను. ఎందుకంటే ఎడతెరిపిలేని షెడ్యూల్స్‌వల్ల ఒక్కోసారి జిమ్‌కు వెళ్లడం కుదరకపోవచ్చు. అందుకే నా వ్యాయామాల్లో అధిక శాతం ఇంట్లో చేసేవే ఉంటాయి' అంటున్న నేహా... అందుకు తగినట్టుగానే తన వర్కవుట్స్‌ను డిజైన్ చేసుకుంది.
- పుషప్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తుంది.
- అధిక బరువుల జోలికి పోదు. డంబెల్స్ లాంటి తేలికపాటి బరువు గల వెయిట్స్‌తో సాధన చేస్తుంది.

ఇంటి వంటకే ఓటు...

నేహా నమ్మిన సూత్రం ఇది. అందుకే ఆరోగ్యకరమైన, క్రమశిక్షణగల జీవన శైలికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. తీసుకొనే ఆహారంలో పోషక విలువలు పుష్కలంగా ఉండేలా చూసుకొంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంట తినడానికే ప్రయత్నిస్తుంది.

- రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల మంచి నీళ్లు తాగుతుంది నేహా. అలాగే కొబ్బరి నీళ్లు కూడా తీసుకొంటుంది. ఇవి శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి. చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచడంలో దోహదపడతాయి.
- పండ్ల రసాలు ఎక్కువగా తాగుతుంది. పార్టీలకు వెళ్లినా జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లు, సూప్స్ లాంటి ఆరోగ్యకరమైన, బలవర్ధకమైనవే తీసుకొంటుంది.
- నేహాకు కాఫీ చాలా ఇష్టం. కానీ అప్పుడప్పుడు మాత్రమే తాగుతుంది. సేంద్రియ ఎరువులతో పండిన ఆహార పదార్థాలనే వంటకు ఉపయోగిస్తుంది.

20న అంగన్వాడీల సమ్మె

- వేతనాల పెంపు, బాలసంజీవని యాప్‌లో మార్పులకు డిమాండ్
- సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనీ విజ్ఞప్తి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వేతనాల పెంపు, మినీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చే జీవో వెంటనే ఇవ్వాలని, బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని, అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనే డిమాండ్లతో మే 20న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె చేయనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాల సంజీవని యాప్‌లో 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలకు ఫొటో క్యాప్చర్ తీసేయాలని, ప్రస్కూల్ పిల్లలకు ఫొటో ఆధారంగా రేషన్ ఇవ్వాలనే నిబంధనలు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు, మినీ వర్కర్లకు ఫేస్ యాప్ ఇన్, ఔట్ లొకేషన్ తీసివేయాలని, లబ్ధిదారులకు అందిస్తున్న సరుకులన్నీ ఒకేసారి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరకు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. కార్మిక కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని, ఆ సమ్మెలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.



ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఐదు లక్షల మందితో 2న ప్రధాని సభ

- అందుకు తగ్గట్లుగా అమరావతిలో పకడ్బందీ ఏర్పాట్లు
- పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా వచ్చే నెల 2న జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు 5 లక్షల మంది హాజరుకానున్నారని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. అమరావతిలో జరిగే ఆ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని రోడ్ షో, సభ ఏర్పాట్లను మంత్రి బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి రెండుగంటలపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రధాని పాల్గొనే సభా ప్రాంగణానికి చేరుకునేందుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే 2న మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొంటారని, అనంతరం వేదిక వద్దకు చేరుకుంటారని వెల్లడించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభలో ఉంటారని చెప్పారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించామని తెలిపారు. ప్రజలు సభ వద్దకు చేరుకునేందుకు వీలుగా ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లతో పాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయని తెలిపారు. ఈ రోడ్లకు తక్షణం మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలని సీఆర్డీఏను ఆదేశించామన్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు, తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్లపై విస్తృత ప్రచారం కల్పించాలి

- ఇప్పటివరకు ఏవైనా కార్యక్రమాలు చేపట్టారా?
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్ల పనితీరుపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముందని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. మద్యం డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన లేదని పేర్కొంది. మద్యం సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారు? ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టారు? ప్రచార కార్యక్రమాల కోసం బడ్జెట్ ఏమైనా కేటాయించారా? పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎక్సైజ్, ఆరోగ్య శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. డీఅడిక్షన్ సెంటర్ల పనితీరు, రోగులకు అందుతున్న చికిత్సను నిరంతరం పర్యవేక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విశాఖకు చెందిన డాక్టర్ ఎస్.షిరిన్ రెహ్మాన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 21 ఏళ్ల లోపువారికి మద్యం విక్రయించకుండా నిలువరించేందుకు ఆధార్ లింక్ చేసి మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వి.రఘు వాదనలు వినిపించారు. రాష్ట్రంలో డీఅడిక్షన్ సెంటర్ల నిర్వహణ సరిగా ఉండటం లేదని, అందులో ఎంతమంది చికిత్స పొందారనే వివరాలు ఏపీ అధికారుల వద్ద లేవని అన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు మద్యం విక్రయాల ద్వారా అత్యధిక రెవెన్యూ వస్తుందని, ఈ నేపథ్యంలో అమ్మకాలను నియంత్రించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.







చిత్రజ్యోతి

SINCE 1965

మానవత్వానికే మాయని మచ్చ

పహల్గాం ఉగ్ర దాడిపై చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల కాల్పుల ఘటనను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



అమాయక ప్రజలు, పర్యాటకులను బలిగొన్న భయంకరమైన, హృదయ విదారకమైన దాడి ఇది. ఘటన జరిగిన తీరు గురించి తెలుసుకుంటుంటే మనసు వికలమైంది. క్షమించరాని క్రూరమైన చర్య ఇది. బరువెక్కిన హృదయంతో మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి జరిగిన నష్టం పూడ్చలేనిది. - **చిరంజీవి**





ఉగ్రదాడి హేయం... అణచడమే మన ధ్యేయం. వికృత చర్యలపై విక్రమిద్దాం... కశ్మీరం మనదే సదా... పోరాడుదాం పద... అసువులు బాసిన అమాయక పౌరులందరికీ నా అశ్రునివాళి! - **బాలకృష్ణ**

పహల్గాం దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక్కటిగా నిలబడదాం. ఇలాంటి దాడుల ద్వారా దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు. మన సాయుధ దళాలపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కలసికట్టుగా ఈ కష్టకాలాన్ని అధిగమిద్దాం. జనసేన పార్టీ మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. మా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం.

- **పవన్ కల్యాణ్**



ఇది చీకటి రోజు. పహల్గాం దాడి ఘటనతో చాలా బాధపడ్డాను. క్రూరత్వానికి వ్యతిరేకంగా కలసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నాను. బాధిత కుటుంబాలకు ఈ విషాదం నుంచి బయటపడే శక్తి లభించాలి.

- **మహేశ్‌బాబు**



పహల్గాం ఉగ్రదాడి తీవ్రంగా బాధించింది. ఇలాంటి ఘటనలకు మన సమాజంలో స్థానం లేదు. బాధిత కుటుంబాలను చూస్తుంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. - **ఎన్టీఆర్**



పహల్గాం ఘటన గురించి నాలో చెలరేగిన బాధను, కోపాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. మనమంతా ఒక్కటిగా నిలిచి ఇలాంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

- **షారూఖ్‌ఖాన్**

భూతల స్వర్గం కశ్మీర్, తీవ్రవాద చర్యలతో నరకంగా మారుతోంది. వారికి అమాయక ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. అమాయకుల ప్రాణాలు హరించడం హేయమైన చర్య.

- **సల్మాన్‌ఖాన్**

ఇది క్షమార్హం కాని నేరం. ఈ ఉగ్రచర్యపై అందరూ మౌనం వీడాలి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

- **సంజయ్‌దత్**



పేదలకు దుస్తుల పంపిణీ

మండపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం సురుచి సంస్థల అధినేత పి.మల్లికార్జునరావు (మల్లిబాబు) తల్లి స్వర్గీయ పి.మాణిక్యం 14వ వర్ధంతి సందర్భంగా తాపేశ్వరంలో బుధవారం పేదలకు చీరలు, సీట్లను మల్లిబాబు దంపతులు పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పదిలో సత్తాచాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు

మండపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండపేట మండలం అర్బన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారని ఎంఈవో రామచంద్రరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 82.39 శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 97.27 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆయన చెప్పారు.మండలం నుంచి మొత్తం 1769 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 1583 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 404 మంది బాలురు, 522 మంది బాలికలు పరీక్షలు రాయగా మొత్తం 763 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో 549 మంది ప్రథమ శ్రేణి, 156 మంది ద్వితీయ శ్రేణి, 59 మంది తృతీయశ్రేణి సాధించారన్నారు. అలాగే ఏడిద జిల్లా పరిషత్ బాలిక పాఠశాలకు చెందిన విద్యార్థిని మల్లిపూడి జాహ్నవి (581) మార్కులతో మండలంలోనే ప్రథమస్థానంలో నిలిచింది.



ద్వారపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పదోతరగతి విద్యార్థులు

ద్వారపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

పదోతరగతి ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించిన ద్వారపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ నేతృత్వంలో జరిగింది.

రాయవరం: పదోవతరగతి పబ్లిక్ పరీక్షల్లో మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసుపులేటి వెంకటలక్ష్మి రమ్యనందు 589 మార్కులు పొంది మండలంలోనే ప్రథమ స్థానం సాధించినట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే వెదురుపాక జడ్పీ హైస్కూల్‌కు చెందిన బోనం వెంకట భాస్కర్ శ్రీరామ్ 588 మార్కులతో మండలంలో రెండో స్థానం సాధించినట్టు హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. సోమేశ్వరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన శాకా నాగరమ్య 577 మార్కులు సాధించగా, రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దొంతంశెట్టి గంగా సాయిదీపిక 569 మార్కులు సాధించినట్టు హెచ్‌ఎం శాంతిసునీత తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 91 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవో వై.సూర్యనారాయణ తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల ఫలితాలు ఇలా: పసలపూడి శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి కర్రి సమంత్ రాజారెడ్డి 590 మార్కులు సాధించగా, రాయవరం భాష్యం స్కూల్ విద్యార్థి ద్వారంపూడి లాస్యశ్రీ 588 మార్కులు, సాయితేజ స్కూల్‌కు చెందిన కొవ్వూరి శ్రీదేవి సుమ 584 మార్కులు సాధించినట్టు ఎంఈవో తెలిపారు.

కె.గంగవరం: పదోతరగతి ఫలితాల్లో పామర్రు, కందూరు, శివల, కూళ్ల, సత్యవాడ, సందరపల్లి ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారు. దంగేరుకు చెందిన ఏ.గంగాధర్ 584, ఎంఎస్‌వీ ఎస్ గణేష్ 581 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలించారు. విద్యార్థులను ఎంఈవో, ఆయాపాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు.

కపిలేశ్వరపురం : 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 470 మంది పరీక్షకు హాజరుకాగా, వీరిలో 447 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అంగర జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పేరాబత్తుల ప్రసన్న 576 మార్కులతో మండల ఫస్ట్, అరవపల్లి ఈశ్వరి 571 మార్కులతో ద్వితీయ, కర్రి జాహ్నవి 563 మార్కులతో తృతీయ స్థానాలు సాధించినట్టు ఎంఈవో కే. తాతారావు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట : ఎమ్మెల్యే



రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, తదితరులు

మండపేట., ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు మంజూరైన పవర్ టిల్లర్స్ పవర్‌స్ప్రేయర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం రైతుల బకాయిలు రూ. 6000 కోట్లను నిలుపుదల చేస్తే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని విడుదల చేసిందన్న విషయాన్ని గుర్తుచేశారు. నియోజకవర్గంలో రైతులకు మంజూరైన 25 పవర్ టిల్లర్స్, 5 రోటోవేటర్‌లు, 10 ట్రాక్టర్‌లు, 24 పవర్‌స్ప్రేయర్లను రైతులకు ఎమ్మెల్యే, ఎంపీపీ ఉండమట్ల వాసు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, పిల్లాతాతాలు, ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ నాగేశ్వరరావు, మూడు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ



రాయవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్థుల ఇలవేల్పు పుంతలో ముసలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేదపండితులు బండి వెంకటరామ సుబ్రహ్మణ్యం, కూరెళ్ల సూర్యనారాయణమూర్తి, శివప్రసాద్ పాల్గొని హోమం, కళాన్యాసం ఉదయం 10:42 నిమిషాలకు అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ, మండప పునఃపూజలు, పూర్ణాహుతి, బలిహరణ, గోముఖ దర్శనం, తదితర పూజలు చేశారు. అమ్మ వారిని జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాయవరం, లొల్ల, వి.సావరం, వెదురుపాక, మహేంద్రవాడ, కొమరిపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

రేపటి నుంచి లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో సమ్మర్ క్యాంప్

రాయవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో ఈనెల 25 నుంచి విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. బుధవారం లొల్లలో ఆయన మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు 10 రోజుల పాటు ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, యోగా, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, మెడిటేషన్, భగవద్గీత, మ్యూజిక్, గేమ్స్, గణితం, తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

10 నుంచి 15 సంవత్సరాల వయసు లోపు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9966673283, 99666 73111 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

'పెహల్గాం ఉగ్రదాడి అమానుషం'



కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన నేత లీలాకృష్ణ, కూటమి నేతలు

మండపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడడం అమానుషమని పలువురు ఖండించారు. ఈ మృతుల కుటుంబాలకు శాంతి చేకూరాలని బుధవారం రాత్రి మండపేటలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ నేతృత్వంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కూటమి నేతలు హాజరై మాట్లాడారు. కూటమి నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కె.సాయిరాం, కె.మురళీకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, ఎండీ ఖరీమ్, కాశీన కాశీ, నామాల చంద్రరావు, కూటమి నేతలు, జనసైనికులు పాల్గొ న్నారు. దీనిపై పలుపార్టీల నేతలు స్పందిస్తూ కేంద్రం తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, తదితరులు వున్నారు.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు : మంత్రి



సత్యవాడలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం సత్యవాడలో రూ. 89.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను మంత్రి చేతులమీదుగా ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం, మండల ప్రజా పరిషత్ నిధులతో మొత్తం 21 సీసీ రోడ్లు, ఒక డ్రైన్ నిర్మాణానికి సంబంధించిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించడంపై కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహశీల్దార్ బి. మృత్యుంజయరావు, పంచాయతీ కార్యదర్శి జె.సూర్య గౌతమి, జేఈ ఏసురత్నం, వ్యవసాయ శాఖ ఏడీ బి.రవికుమార్, ఏవో బలుసు రవి, విద్యుత్ శాఖ ఏఈ టి.భాస్కర్, కూటమి పార్టీ నాయకులు పళ్లంరాజు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మండలంలోని రైతులకు బుధవారం మంత్రి చేతులమీదుగా పవర్ టిలర్లు పంపిణీ చేశారు. రూ.రెండు లక్షల 29500 విలువైన పవర్ టిల్లర్‌ను రూ. లక్ష సబ్సిడీపై అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ఏవో బి.రవి, ఎంపీడీవో కార్యాలయ ఏవో టీవీఎస్ రెడ్డి, స్థానిక నేతలు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



గంగవరంలో పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

'ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి'



విజయశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయని రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి అన్నారు. లొల్ల ఎంపీయూపీ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రొక్కం విజయశ్రీ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం సన్మాన సభను ఏర్పాటుచేశారు. హెచ్‌ఎం కొవ్వూరి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీవైఈవో , సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, తదితరులు హాజరై విజయశ్రీ అందించిన సేవలను కొనియాడారు. తర్వాత విజయశ్రీ దంపతులను జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, టీడీపీ నాయకుడు సుంకవిల్లి గంగరాజు, విశ్వమానవతా సంస్థ అధినేత అల్లూరి శ్రీనివాసచౌదరి, ఉపాధ్యాయులు చంద్రకళ, దండు రాంబాబు, జేఆర్ కృష్ణవేణి , గ్రామస్థులు పాల్గొన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి హేయం



రామచంద్రపురంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

కార్మిక శాఖా మంత్రి సుభాష్
పలుచోట్ల కొవ్వొత్తుల ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాన్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఈ చర్యను ఖండించాలన్నారు. ఇద్దరు విదేశీయులతో పాటు 28 మంది అమాయకుల ప్రాణాలు బలిగొని, అనేక మందిని గాయపరచిన సంఘటన అనాగరిక చర్య అన్నారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. శాంతి నెలకొన్న కాశ్మీర్ ఆతిథ్య స్ఫూర్తిపై దాడిగా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు దేశానికి అండగా నిలవాల్సిన సమయమని పేర్కొన్నారు.

మృతులకు జనసేన నివాళి.. పెహల్గాన్‌లో పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళి అర్పిస్తూ బుధవారం రాత్రి జనసేన నాయకులు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు జనసేన పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డులో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతులకు ఆత్మకు శాంతికలగాలని మానవహారం నిర్వహించారు.

దుర్మార్గపు చర్య: ముత్యాల బాబ్జి

కొత్తపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహ్లగామ్‌లో ఉగ్రవాదుల హత్యాకాండ దుర్మార్గ చర్యని, ఈ ఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి ముత్యాల బాబ్జి, ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు పేర్కొన్నారు. కొత్తపేటలో వారు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్నామన్నారు. మతం పేరుతో ఉగ్రవాదులు ఈ దాడి చేయడం అవమానుషమన్నారు. మతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒకతాటిపైకి రావాలని, ఈ చర్యకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవాలన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రావులపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద ఉగ్రవాడిదాడిలో అసువులు బాసిన వారికి బాధాతప్త హృదయంతో నివాళులర్పించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలపై ప్రపంచ వ్యాప్తంగా కఠినమైన ఆంక్షలు విధించాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పహల్గాన్ మృతులకు నివాళి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పిస్తూ అమలాపురంలో బీజేపీ, జనసేన నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పిల్లి హరిక, పిల్లి రిషిత సంతోషిణి, రావి మౌనిక, లలితా నాగేశ్వరి



రషితాబేగం, వాసంశెట్టి ఇంద్రశ్రీ, కోలపల్లి యశస్విని

ఆలమూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఆలమూరు మండలంలో 728 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 672 మంది(92శాతం) ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో బి.అప్పాజీ తెలిపారు. పలువురు విద్యార్థులు ప్రతిభకనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆలమూరు బొబ్బా జయశ్రీ జడ్పీ గరల్స్ హైస్కూల్లో చదువుతున్న పిల్లి హరిక 587, పిల్లి రిషిత సంతోషిణి 584, నందిగామ సాయిహరిణి 577 మార్కులు సాధించారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభి నందించారు. అలాగే ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని ఎస్.కీర్తిభావన 590, పి.పృథ్వీనాథ్ 588, బి.సుజాత, ఎస్ఎస్.సత్యశృతి 585 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఆత్రేయపురంలో 89శాతం ఉత్తీర్ణత

ఆత్రేయపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని పదో తరగతి పరీక్షలకు 565 మంది విద్యార్థులు హాజరుకాగా 503 మంది(89 శాతం) ఉత్తీర్ణులైనట్టు ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ తెలిపారు. ర్యాలి జడ్పీ హైస్కూల్ కు చెందిన రావి మౌనిక 581 మార్కులతో, పెండెం లలితా నాగేశ్వరి 577 మార్కులతో ద్వితీయ స్థానం, వాడపల్లి హైస్కూల్‌కు చెందిన జ్ఞానసత్యశ్రీ 575 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉత్తీర్ణతకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అలాగే ర్యాలి ఉషా అకాడమీకి చెందిన నరుకుల శ్రీపూజ 593మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ కరుటూరి రత్నారావు తెలిపారు.

రామచంద్రపురంలో 81.63 శాతం

ద్రాక్షారామ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం నుంచి పదో తరగతి పరీక్షలకు 1617 మంది విద్యార్థులు హాజరు కాగా 1320 మంది(81.63 శాతం) ఉత్తీర్ణులైనట్టు ఎంఈవోలు వీరరాఘవరెడ్డి, నాగేశ్వరి తెలిపారు. ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పలివెల స్వాతి 582 మార్కులు సాధించినట్టు హెచ్‌ఎం తెలిపారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 28 మంది పరీక్షకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. వెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల 71శాతం ఉత్తీర్ణత సాధించింది. సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల 86.11 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

కొత్తపేటలో 84శాతం..

కొత్తపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం నుంచి పదో తరగతి పరీక్షలకు 919 మంది విద్యార్థులు హాజరు కాగా 776 మంది(84 శాతం) ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో ఎం.హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 80శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కాంతి భారతి స్కూల్ విద్యార్థిని కురుసా తన్మయిశ్రీల క్ష్మిషణ్ముఖి 590 మార్కులు సాధించగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సయ్యద్ రషీత్‌బేగం 587 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్కరించారు. కాగా కాంతి భారతి పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు ఆదుమూర్తి రామకృష్ణ శర్మ-మహాలక్ష్మి జ్ఞాపకార్థం షణ్ముఖికి రూ.20 వేల నగదు బహుమతిని ఎమ్మెల్యే సత్యానందరావు చేతులు మీదుగా అందజేశారు.

రావులపాలెంలో 88.4 శాతం..

రావులపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాలలో రావులపాలెం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో విద్యార్థులు 88.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో శ్రీనివాసరాజు తెలిపారు. మండల పరిధిలోని రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాలలో చదువుతున్న వాసంశెట్టి తింపుసాయి ఇంద్రశ్రీ 577 మార్కులతో ప్రథమ స్థానం, ఈతకోట జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కోలపల్లి యశస్విని 576 మార్కులతో ద్వితీయస్థానం, పొడగట్లపల్లి జడ్పీ హైస్కూల్ అత్తిలి పూజిత 575 మార్కులతో తృతీయ స్థానం సాధించారని మండల విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

వెర్నమ్మ ఆలయంలో డీఎస్పీ పూజలు



వెర్నమ్మ తల్లిని దర్శించుకుంటున్న డీఎస్పీ మురళీమోహన్

రావులపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఈతకోట గ్రామదేవతలు వెర్నమ్మ, పోలేరమ్మ ఆలయాలలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ దర్శించుకని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం



వాడపల్లి పాఠశాలలో పుస్తక దినోత్సవ దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు అద్దేపల్లి సురేష్, చింతా శ్యామ్‌కుమార్ పుస్తకం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. పుస్తకాలు చదివే చిన్నారులు కథలను వివరించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా సాధికార చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి ఎంపికపై హర్షం

కొత్తపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులవ్వడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం మాట్లాడుతూ 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో ఏర్పడ్డ ఈ కమిటీలో పురందేశ్వరి చైర్‌పర్సన్‌గా ఉండడం అభినందించతగ్గ విషయమన్నారు.

ఆత్రేయపురం రైతులకు ట్రాక్టర్ల పంపిణీ



రావులపాలెంలో ట్రాక్టర్లను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద రాయితీపై వచ్చిన కుషి ట్రాక్టర్లను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆత్రేయపురం మండలానికి చెందిన లబ్ధిదారులకు కుషి ట్రాక్టర్లను అందజేసి మాట్లాడారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, సాధనాల శ్రీను, కాయల జగన్నాధం, పడాల బుల్లి కొండారెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

రావులపాలెం మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అడపా ప్రసాద్, తిరుపతిరావు నివసిస్తున్న తాటాకిల్లు బుధవారం అగ్నిప్రమాదానికి గురై వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. నిరాశ్రయులైన బాధితులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి, వారికి నిత్యావసర సరుకులను అందించారు. వారికి ప్రభుత్వ పరంగా అందే సాయాన్ని తక్షణమే అందేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో షేక్స్‌ఫియర్ జయంతి

రావులపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రఖ్యాత ఇంగ్లీస్ నాటక కవి, రచయిత విలియమ్ షేక్స్‌ఫియర్ జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. షేక్స్‌ఫియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన రచయితలను విద్యార్థులకు వివరించారు.

వాడపల్లి వెంకన్నకు అష్టోత్తర పూజలు



ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,46,382 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఈవో పరిశీలించి సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఆలమూరు ఏఈ దుర్గాప్రసాద్

ఆలమూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ అధ్వర్యంలో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈనెల 24న ఆలమూరులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్టు ఆలమూరు ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ వేదిక ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ లోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు సురేఖరాణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబా, ఫైనాన్స్ సభ్యుడు ఎస్.సుబ్బారావు తదితరులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవడానికి సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలసినదిగా ఆయన కోరారు.